ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com
RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

THURSDAY 03RD SEPTEMBER 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 169 COST : 3\- KHAMMAM, TELANGANA

గురువారం 03 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :169 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## ఉబర్‌లో 3,300 మంది ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 ప్రముఖ అంతర్జాతీయ క్యాబ్ సేవల దిగ్గజం 'ఉబర్ టెక్నాలజీస్' తన ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతానికి సమానం. ఈ మేరకు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు. సంస్థలో నిర్వహణ స్థాయిలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపరిచేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సీఈవో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అనవసరమైన విభాగాలు, అదనపు మేనేజ్‌మెంట్ స్థాయిలు పెరిగాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఆర్టీసీ నైట్ సర్వీసులు ప్రారంభం



హైదరాబాద్,సెప్టెంబర్2 హైదరాబాద్ జంటనగరాల పరిధిలో నైట్ టైమ్ రవాణా సౌకర్యం కోసం ఇబ్బందులు పడుతున్న వారికి తెలంగాణ స్టేట్ రోడ్డు రవాణా సంస్థ శుభవార్త చెప్పింది. నైట్ డ్యూటీలు చేసే ప్రైవేట్ ఎంప్లాయిస్, ఐటీ కంపెనీల్లో నైట్ షిఫ్ట్‌లకు వెళ్లే టెక్కీలు, సివిల్ వర్క్స్ చేసుకునే వేలాది మంది ఇకపై ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుతో కష్టాలు,డబ్బులు ఖర్చు చేసుకునే బాధను తగ్గించింది. ఇప్పటి వరకు పగటి పూట మాత్రమే ఆర్టీసీ బస్సులు నడిచేవి.. కాని ఇప్పుడు రాత్రి వేళల్లో కూడా ఆర్టీసీ బస్సులు నడుపుతోంది. నైట్ 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు నగరంలోని ప్రధానంగా 6 రూట్లలో ఈ సౌకర్యాన్ని కొనసాగిస్తోంది.హైదరాబాద్ ఐటీ కారిడార్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సులు నడుపుతోంది తెలంగా స్టేట్ రోడ్డు రవాణా సంస్థ. ప్రయాణికులకు రవాణా కష్టాలు ఉండకూడదనే మంచి ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకుంది. మంగళవారం రాత్రి నుంచి ఈ సర్వీసులను కొనసాగిస్తోంది. మొత్తం 15 బస్సులతో ఈ సేవలను ప్రారంభించినట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీధర్

➤ మిగతా 2వ పేజిలో..



# ఇన్వెస్ట్ తెలంగాణలో రక్షణ ఎక్స్‌పో ప్రారంభించండి

### కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ వినతి

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ÷శవ్యాప్తంగా రక్షణ రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశర చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు. రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్

➤ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణ విమానాశ్రాయాలను త్వరగా పూర్తి చేయండి

### కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం రేవంత్ భేటీ



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం

➤ మిగతా 2వ పేజిలో..

# రెడ్లకో న్యాయం.. బిసిలకో న్యాయమా




- నాపై చర్యలు తీసుకునే ముందు రేవంత్ సంగతి చూడండి
- పదేళ్ళు నేనే ముఖ్యమంత్రి అని ఎలా అంటారు
- ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలతో కొండా సురేఖ భేటీ
- మీడియా ముందు సంచల వ్యాఖ్యలు

హైదరాబాద్,సెప్టెంబర్2 నాపై చర్యలు తీసుకునే ముందు సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌పై సురేఖ డైరెక్ట్ అటాక్ చేశారు. ఢిల్లీలో హైకమాండ్‌ను కలిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పదేళ్లు సీఎం అని తనే చెప్పుకుంటున్నాడు. అది ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఇతర శాఖ మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. సీఎంపై మంత్రులు, నేతలు కూడా తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనని రాజీనామా చేయమని, మరొకటిగాని నాకు ఎవరు చెప్పలేదు. హైకమాండ్‌కు రాతపూర్వకంగా అన్ని వివరాలు తెలియజేశానని తెలిపారు. నా బిడ్డ మాట్లాడితే నాకెందుకు శిక్ష వేస్తారు. రెడ్లలో ఎంతో మంది అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. బీసీకి ఒక న్యాయం ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. అంతా సద్దుమణిగింది అనుకునే తరుణంలో సురేఖ వ్యాఖ్యల అంతరార్ధం ఏటంటనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. ఢిల్లీలో రాజీ మంత్రం బెడిసికొట్టడం వల్లే ఆమె ఇలా మాట్లాడుతుందే మోనని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. మరోవైపు సురేఖపై అధిష్ఠానానికి సీఎం నివేదికను అందజేశారు. సాధ్యమైనంత త్వరగా ఆమె చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈరోజే కొండా సరేఖపై

➤ మిగతా 2వ పేజిలో..

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- మరింత ముదురుతున్న యుద్ధ వాతావరణం
- అమెరికా, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులు
- పెళ్లి వేడుకపై అమెరికా క్షిపణి దాడి
- ఐదుగురు మృతి, 50 మందికి గాయాలు
- ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ సైన్యం
- ప్రతీకారం తీర్చుకుంటాం..
- అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్!

టెహ్రాన్,సెప్టెంబర్2 పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అమెరి కా దాడులతో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఇరాక్, జోర్డాన్‌పై ఇరాన్ ప్రత్యేక సైనిక దళం ఐఆర్‌జీసీ దాడి చేసింది. కువైత్, బ్రహెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్ ప్రాంతంలో అమెరికా దాడి వల్ల ఓ పెళ్లింట విషాదం సంభవించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందారని, 50 మంది గాయపడ్డారని తెలిపింది. ఈ ఉదంతంపై ఇరాన్ సుప్రీం లీడర్ మండిపడ్డారు. యూఎస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. యూఎస్‌కు తమ సైన్యం మర్చిపోలేని

➤ మిగతా 2వ పేజిలో..

## కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

- ఎటు చూసినా విధ్వంసం, వికృతం
- జలద్రోహం చేస్తున్న జలగల పాలన
- అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో
- భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమీషన్లు
- వెయ్యిరోజుల్లో 4.50లక్షల కోట్ల అప్పులు
- కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనపై బిఆర్‌ఎస్ ఛార్జ్‌షీట్
- సిఎం రేవంత్ పాలనపై నిప్పులు కక్కిన కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్2 కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి

➤ మిగతా 2వ పేజిలో..

## కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. బుధవారం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై హరీశ్ రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో షార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రొ మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్ అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో దిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. దిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఎంగిలి విస్తరాకుల దగ్గర కుక్కలు కొట్టుకున్నట్లు.. రాష్ట్ర సంపాదన కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారు. ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్వచించరు. జల ద్రోహం చేస్తున్న జలగల పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు చంచాగిరి చేస్తూ గురువుగారికి దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెప్పారు. వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారన్నారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్కు డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్‌ఏ నోరు తెరువదు. జీఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మోచేయి నీళ్లు తాగే అధికారి ఆదిత్య నాద్ దాస్ ను సలహాదా రుగా పెడితే తెలంగాణకు నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారు. రూ.50 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని రూ.20 కోట్లతో ముగించారని మండిపడ్డారు. నీళ్లు అడిగితే కోసి రక్తం చల్లమన్నారు. యూరియా అడిగిన రైతులపై లాఠీ చార్జి చేశారు. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష, మోటర్లుకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు బందు అయింది. రాహుల్ బంధ్ చాలయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నర కోట్ల అప్పు చేశారు. రియల్ ఎస్టేట్ కుప్ప కూలింది. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడున్నది అచ్చ కాంగ్రెస్ కాదు, పచ్చ కాంగ్రెస్ కాదు, లుచ్చ కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో అసలైన కాంగ్రెస్ లేదని తెలంగాణ సమాజాం అనుకుంటుందన్నారు. మొదటి నుంచి వారికి కాకుండా మధ్యలో వచ్చిన వారికి అందలం ఎక్కించార న్నారు. పార్టీ కోసం పని చేసిన వారిని విస్మరించారన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్శించారు.

## రెడ్లకో న్యాయం.. బిసిలకో న్యాయమా

హైకమాండ్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు. బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## తెలంగాణ విమానాశ్రాయాలను త్వరగా పూర్తి చేయండి

అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.ఆదిలాబాద్‌లో రన్ వే ఫైలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. టెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు.

## ఇన్వెస్ట్ తెలంగాణలో రక్షణ ఎక్స్‌పో ప్రారంభించండి

వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించ నున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ÷శివ్యాప్తంగా రక్షణ రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశర చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు. రక్షణ ఎక్స్‌పో–2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కోరారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ శాఖ మొత్తం1,500 ఎకరాలు కోరిందని.. మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాలకు ఈ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు

## అనంతపురంలో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్ట్

### 400 మెగావాట్ల పవన-సౌర హైబ్రిడ్ పునరుత్పాదకత

అమరావతి,సెప్టెంబర్2 ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో, బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీల సంయుక్త సంస్థ అయిన ఎవ్రెన్ అభివృద్ధి చేస్తున్న 552 మెగావాట్ పీక్ యుటిలిటీ-స్కేల్ సౌర విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) కాంట్రాక్టును యాక్సిస్ ఎనర్జీ దక్కించుకుంది. రాబోయే 18 నెలల్లో ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది యాక్సిస్ ఎనర్జీ యొక్క స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టుల విస్తరణలో ఒక ముఖ్యమైన భాగంగా నిలవడంతో పాటుగా ఎవ్రెన్‌తో దాని వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ సోలార్ ప్రాజెక్టు 400 మెగావాట్ల పవన–సౌర హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులో భాగంగా ఉంది. ఇందులో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ( ను అనుసంధానించి, రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ యొక్క గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను తీర్చటానికి అనుగుణంగా రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్, గరిష్ట వినియోగ సమయాల్లో పునరుత్పాదక విద్యుత్‌ను అందిస్తుంది. ఇది గ్రిడ్ విశ్వసనీయతను పెంచుతూ, రాష్ట్ర స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు మద్దతు ఇస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లోని 640.5 మెగావాట్ల పవన విద్యుత్ విభాగానికి సంబంధించిన ఈపీసీ పనులను కూడా యాక్సిస్ ఎనర్జీ చేపడుతోంది, ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా యాక్సిస్ ఎనర్జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళీ సూరపనేని మాట్లాడుతూ, "బీబీబీ ప్రాజెక్ట్‌లోని సౌర విద్యుత్ విభాగానికి సంబంధించి ఈపీసీ కాంట్రాక్టును దక్కించుకోవడం యాక్సిస్ ఎనర్జీకి ఒక ముఖ్యమైన మైలురాయి. ఇది ఎవ్రెన్‌తో మా దీర్ఘకాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ ప్రతిష్ఠాత్మక హైబ్రిడ్ ప్రాజెక్టులో పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏకకాలంలో అమలు చేయడం ద్వారా సమగ్ర పునరుత్పాదక ఇంధన పరిష్కారాన్ని అందించే అరుదైన అవకాశం మాకు లభించింది. అత్యుత్తమ ఇంజినీరింగ్ నైపుణ్యం, సమర్థవంతమైన కార్యకలాపాల నిర్వహణతో పాటు ప్రపంచస్థాయి ప్రాజెక్టు అమలు సామర్థ్యాలను సమన్వయం చేసి, ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నాం. విశ్వసనీయమైన, విస్తరించదగిన, సుస్థిరమైన స్వచ్ఛ ఇంధన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశ ఇంధన పరివర్తనకు మద్దతు ఇవ్వాలనే మా నిరంతర నిబద్ధతను ఈ ప్రాజెక్ట్ ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఎస్పీడీసీఎల్)తో దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏలు) మద్దతుగా ఉన్నాయి. పవన, సౌర విద్యుత్ ఉత్పత్తితో పాటు బ్యాటరీ నిల్వ వ్యవస్థను సమగ్రంగా అనుసంధానించడం వల్ల పునరుత్పాదక విద్యుత్‌ను మరింత విశ్వసనీయంగా వినియోగించుకోవచ్చు. అలాగే, విద్యుత్ ఉత్పత్తిలో ఉండే హెచ్చుతగ్గులను నిర్వహించడంతో పాటు, గరిష్ఠ డిమాండ్ సమయంలో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇది దోహదపడుతుంది.

## టిటిడి డిప్యూటి ఇవో లోకనాథం నివాసంలో ఎసిబి సోదాలు

### భారీగా ఆభరణాలు స్వాధీనం చేసుకుఎన్న ఎసిబి

తిరుపతి,సెప్టెంబర్2 ఆదాయానికి మించిన ఆస్తుల క ఏసులో తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవో మెందు లోకనాథం నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి అస్తుల ఆరోపణల నేపథ్యంలో బుదవారం ఉదయం నుంచి తిరుపతి పెదకాపు లేఔట్‌లోని లోకనాథం ఇంటితో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి 7 బృందాలుగా ఏర్పడిన అధికారులు తనిఖీలు చేస్తున్నారు. తిరుమలలో లోకనాథంకు సంబంధించిన వసతిగృహంతో పాటు, తిరుపతిలోని లోకనాథం ఇద్దరు బావమరుదుల ఇళ్లతో పాటు, ఏర్పేడు మండలం చెల్లూరులోని అతని సోదరుడి నివాసంలో కూడా తనిఖీలు చేపట్టారు. తిరుపతి ఎస్టీవీ నగర్ ఎస్‌బీఐ బ్రాంచ్ లాకర్లను పరిశీలిస్తున్నారు. ఏసీబీ దాడుల సమయంలో లోకనాథం ఇంట్లోనే ఉన్నారు. తనిఖీల్లో.. రూ.కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, స్థిర, చరాస్తులు గుర్తించినట్లు సమాచారం. 2011లో తితిదే డిప్యూటీ ఈవో భూపతిరెడ్డి నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. దాదాపు 15 ఏళ్ల తర్వాత తితిదే ఉద్యోగి నివాసంలో తనిఖీలు చేయడం ఇదే తొలిసారి.

## ఆర్టీసీ నైట్ సర్వీసులు ప్రారంభం

తెలిపారు. నగరంలోని ప్రధాన మార్గాలను, ఎక్కువ మంది ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే రూట్లను కలుపుతూ ఈ నైట్ సర్వీసులను నడుపుతున్నారు. 1. కోఠి నుంచి పటాన్‌చెరు ,అబిడ్స్, లక్డీకాపూల్, కొండాపూర్ వరకు రూట్ నంబర్ 222ూా పేరుతో ప్రతి 45 నిమిషాలకు ఒక ట్రిప్ నడుపుతుంది. ఇక 2. రూట్ అఫ్జల్‌గంజ్ నుంచి జదీూ, పటాన్‌చెరు, కోఠి, ఖూఎదీ, మియాపూర్ మీదుగా 218 నంబర్‌తో బస్సులు అందుబాటులో ఉంటాయి. ఇక 3. సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరు , ప్యారడైజ్, కూకట్‌పల్లి, హైటెక్ సిటీ మీదుగా 219 నంబర్‌తో మరో సర్వీసు నైట్ టైమ్‌లో బస్సు సౌకర్యం ఉంది. 4. హైదరాబాద్ శివారు ప్రాంతంగా ఉన్న హయత్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వరకు ఎల్‌బీ నగర్, నాగోల్, తార్నాక కలుపుకుంటూ 290ఖ సర్వీసు ఏర్పాటు చేసింది. దీంతో పాటు బాచుపల్లి నుంచి వేవ్‌రాక్ ,ఐటీ క్యాంపస్‌ల మీదుగా 195ఔ నంబర్ తో ఓ సర్వీసు అందుబాటులో ఉంది. కొండాపూర్ నుంచి సికింద్రాబాద్ వరకు 10ఎ నంబర్ సర్వీసు నడుస్తోంది. ప్రస్తుతం నడుస్తున్న ఆరు రూట్లతో పాటు డిమాండ్‌ను బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామని అధికారులు ప్రకటించారు. గతంలో 'నైట్ రైడర్స్' పేరుతో ఆర్టీసీ ఇలాంటి సర్వీసులను నడిపినప్పటికీ ప్రయాణించే వారి సంఖ్య తక్కువగా ఉండటంతో వాటిని ఆపేసింది. ఇప్పుడు సిటీలో నైట్ షిఫ్టుల్లో పనిచేసే ఉద్యోగులు, ముఖ్యంగా ఐటీ, హాస్పిటాలిటీ రంగాల సిబ్బంది, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సర్వీసులను మళ్లీ ప్రారంభించారు. ఈ నైట్ బస్సులు రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు అధికారులు. ఈ సర్వీసులకు సంబంధించిన మరింత సమాచారం కోసం 99592 26160 నంబర్‌లో సంప్రదించవచ్చని టీజీఎస్‌ఆర్టీసీ సూచించింది.

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

గుణపాఠం చెబుతుందని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహబి పేర్కొన్నారు. ఈ దాడులు ఎందుకు చేశామా? అని చింతించేలా చేస్తామని హెచ్చరించారు. అయితే, హోర్ముజ్‌లో కమర్షియల్ నౌకలపై ఇరాన్ దాడి చేసే ప్రయత్నం చేయడంతోనే తాము దాడులు చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇక తమ భూభాగం వైపు వస్తున్న 13 బాలిస్టిక్ మిసైల్స్‌ను మార్గమధ్యంలోనే ధ్వంసం చేశామని జోర్డాన్ మిలిటరీ పేర్కొంది. మరో మూడు మిసైల్స్ నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయాయని తెలిపింది. ఇరాన్ దాడుల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పింది. బుధవారం ఉదయం ఇరాన్ ప్రయోగించిన పలు మిసైల్స్‌ను అడ్డుకున్నామని మరో ప్రకటనలో కువైట్ తెలిపింది. బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించినట్టు తెలిసింది. అమెరికా దాడుల్లో చిన్నారి మరణించినట్టు ఇరాన్ మీడియాలో వార్తలు రావడంపై యూఎస్ సెంట్‌కామ్ ప్రతినిధి స్పందించారు. ఇరాన్ దళాల లాగా తాము సామాన్య పౌరులను ఏనాడు టా÷-గ్గ్÷ట్ చేయలేదని స్పష్టం చేశారు. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ కౌంటీలో ఉన్న కుహెస్తక్ నగరంలో ఘోరం జరిగింది. ఒక నివాస గృహంలో జరుగుతున్న పెళ్లి వేడుకపై అమెరికా సేనలు క్షిపణితో దాడి చేశాయి. ఈ భయంకరమైన దాడిలో ఒక చిన్నారి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని ఇరాన్ రెడ్ క్రెసెంట్ ప్రకటించింది. ఈ దారుణ ఘటనపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇదొక అత్యంత క్రూరమైన నేరమని అభివర్ణించింది. అమెరికా చేసిన ఈ దారుణ కాండకు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. అమాయకులైన పౌరులపై జరుగుతున్న ఈ దాడులను చూస్తూ అంతర్జాతీయ సమాజం మౌనం వహించడం అత్యంత ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మౌనంగా ఉన్న దేశాలు రేపు తమ వంతు వచ్చినప్పుడు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని బఘాయి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ళ్లి జరుగుతున్న ఇల్లు అమెరికా క్షిపణి శకలాలు తగలడంతో పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా విడుదల చేసింది. ఇల్లంతా శిథిలాల మయంగా మారిన ఆ వీడియోలు అందరినీ కలచివేస్తున్నాయి. అయితే సిరిక్ కౌంటీలో ఏ లక్ష్యాన్ని ఛేదించేందుకు అమెరికా ఈ దాడి చేసిందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. పెళ్లి వేడుకపై జరిగిన ఈ దాడికి సంబంధించి అమెరికా ప్రభుత్వం గానీ, సైన్యం గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అమాయకుల ప్రాణాలు తీసిన అమెరికాపై ఇరాన్ ఇప్పటికే ప్రతీకార దాడులు ప్రారంభించింది. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్, ఇరాక్ దేశాల్లో ఉన్న అమెరికా అనుబంధ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ బలగాలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. హోర్ముజ్ జలసంధి సమీపంలో, దక్షిణ ఇరాన్ పరిసరాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. కొన్ని నెలలుగా అమెరికా, ఇరాన్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న తాజా పరిస్థితులు పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. అమెరికా దాడులకు ఎట్టి పరిస్థితుల్లోనూ దీటుగా బదులిస్తామని ఇరాన్ పదేపదే హెచ్చరిస్తోంది. మరోవైపు ఇరాన్ గనక మరిన్ని దాడులకు పాల్పడితే తీవ్రమైన సైనిక చర్యలు తప్పవని వాషింగ్టన్ కౌంటర్ వార్నింగ్ ఇస్తోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో పెను యుద్ధానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆపత్కాలంలో వెన్నంటి నిలిచిన మిత్రదేశం

భారత్‌కు నేపాల్ ప్రధాని బాలేన్ షా కృతజ్ఞతలు!

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2: నేపాల్‌లో సంభవించిన భయంకర వరద విపత్తు సమయంలో తక్షణమే స్పందించి అండగా నిలిచినందుకు భారత ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి నేపాల్ ప్రధానమంత్రి బాలేన్ షా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నేపాల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన ఆయన, ప్రకృతి ప్రకోపంతో దేశం అతలాకుతలమైన కష్టకాలంలో భారత్ నిజమైన ఆపద్బాంధవుడిలా ఆదుకుందని కొనియాడారు. సహాయక చర్యల కోసం ప్రత్యేక రెస్క్యూ బృందాలు, అత్యవసర ఔషధాలు, ఆహార సామగ్రిని సరిహద్దుల గుండా యుద్ధప్రాతిపదికన పంపి వేలాది మంది ప్రాణాలను కాపాడటంలో భారత్ కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. ఆపదలో నిస్వార్థంగా ఆదుకున్న భారతదేశాన్ని నేపాల్ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు, వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని ప్రధాని బాలేన్ షా స్పష్టం చేశారు. నేపాల్ చరిత్రలోనే కనివినీ ఎరుగని రీతిలో వచ్చిన ఆకస్మిక వరదలు అపార ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. నదులు ఉప్పొంగి గ్రామాలు తుడిచిపెట్టుకుపోవడంతో సహాయక చర్యలు చేపట్టడం స్థానిక యంత్రాంగానికి పెను సవాలుగా మారింది. ఆ సమయంలో భారత జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు), భారత సైన్యానికి చెందిన ప్రత్యేక విమానాలు రంగంలోకి దిగాయి. మారుమూల ప్రాంతాల్లో చిక్కుకుపోయిన బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో భారత బలగాలు విశేష సేవలందించాయని నేపాల్ ప్రధాని సభలో వివరించారు.

## తనయుని జ్ఞాపకార్థం విగ్రహం ఏర్పాటు

- రత్నాపూర్ గ్రామంలో....

రామగిరి (పెద్దపెల్లి జిల్లా) సెప్టెంబర్ 02 అక్షరం న్యూస్:

రత్నాపూర్ గ్రామానికి చెందిన రైతు జక్కుల ఆశాలు పెద్ద కుమారుడు జక్కుల సతీష్ గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడి మృతితో తీవ్ర మనోవేదనకు గురైన కుటుంబ సభ్యులు, అతని జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకునేందుకు తమ పంట పొలంలో సుమారు రూ.2 లక్షల వ్యయంతో సతీష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.బుధవారం సతీష్ సంవత్సరికం సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, బంధువుల సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌ను తలచుకుని కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. కుమారుడిపై తమకున్న ప్రేమ, అనుబంధానికి గుర్తుగా విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమా పీవీ రావు, ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక ప్రశాంత్, సందవేన కుమార్, బోగి సతీష్, మేకల రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి, పెద్దపెల్లి జిల్లా సెప్టెంబర్ 2 (అక్షరం న్యూస్):

తెలంగాణ ప్రభుత్వం “ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్ స్కీం (2026--27)” కింద అర్హులైన బీసీ మహిళల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు రామగిరి ఎంపీడీవో బద్రి శైలజ రాణి తెలిపారు.ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు 18 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, కనీసం 5వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. అలాగే ఒక కుటుంబానికి ఒక యూనిట్‌కు మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.దరఖాస్తుకు అవసరమైన పత్రాలు:ఆహార భద్రత కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం,బీసీ కుల ధ్రువీకరణ పత్రం, కనీసం 5వ తరగతి చదివినట్లు విద్యార్హత ధ్రువీకరణ,ఆధార్ కార్డు,అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 15, 2026లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బద్రి శైలజ రాణి సూచించారు.

## మోడిఫైడ్ సైలెన్సర్ బైక్‌లపై పోలీసుల చర్యలు




మంచిర్యాల జిల్లా/?మందమర్రి, సెప్టెంబర్ 2/అక్షరం న్యూస్ –:

మందమర్రి పట్టణ పరిధిలో సైలెన్సర్లను మోడిఫై చేసి, తీవ్రమైన శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తూ ప్రజలకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్న మోటార్ సైకిళ్లపై మందమర్రి పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా శబ్దాలు చేస్తూ ప్రయాణిస్తున్న 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు మందమర్రి సబ్ ఇన్‌స్పెక్టర్ గోపతి నరేష్ తెలిపారు. ఆయా వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తక్షణమే తొలగించి, సంబంధిత వాహనదారులకు మరియు యువతకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తొలగించి లేదా సైలెన్సర్లను మోడిఫై చేసి అధిక శబ్దాలు చేస్తూ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరం. దీనివల్ల వృద్ధులు, చిన్న పిల్లలు, మరియు రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటువంటి నిబంధనల ఉల్లంఘనలపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంటుంది. ఎవరైనా రూల్స్ అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తాం.”ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించవద్దని, ప్రశాంతమైన వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా ఎస్.ఐ. కోరారు.

## ముస్తాబాద్ లో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -02(అక్షరం న్యూస్ )

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గజ్జెల రాజు ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గజ్జెల రాజు మాట్లాడుతూ.. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, 108 వంటి సేవలు ప్రజలకు అందించిన విశిష్ట కార్యక్రమాలుగా నిలిచిపోయాయని, వైఎస్సార్ ప్రజా సంక్షేమానికి చేసిన కృషి చిరస్థాయిగా గుర్తుండిపోతుందని అన్నారు.నాయకులు మాట్లాడు తు సాగు నీటి ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ళ బాల్ రెడ్డి , ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజిరెడ్డి,ఏ ఎం సి వైస్ చైర్మన్ వెలుముల రాంరెడ్డి,యూత్ కాంగ్రెస్ ఆరుట్ల మహేష్, ఎన్ ఎస్ యూ ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ భాను కుమార్, యూత్ మండల అధ్యక్షులు రంజాని నరేష్, సీనియర్ నాయకులు ఎదునూరి భానుచందర్, తలారి నర్సయ్య, గ్రామ అధ్యక్షులు కొప్పు రమేష్,ఎన్ ఎస్ యూ ఐ దుద్దెడ భాను, బండారి సాయి, సురేష్.దేవయ్య. దేవరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# విజయానికి అడ్డదారులు లేవు.. నిరంతర శ్రమే మార్గం






- సోషల్ మీడియా ప్రభావంతో లక్ష్యాలను కోల్పోతున్న యువత
- జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట టౌన్ /నేరేడుచర్ల, సెప్టెంబర్ 2: అక్షరం న్యూస్

బాలేం గ్రామ సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో సూర్యాపేట రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహించారు. సామాజిక భద్రత, సైబర్ మోసాలు, మహిళా భద్రత, లక్ష్య సాధనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజయానికి అడ్డదారులు ఉండవని, నిరంతర కృషి, సాధనతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.సోషల్ మీడియా ప్రభావంతో యువత ఏకాగ్రతను కోల్పోయి లక్ష్యాల నుంచి దూరమవుతున్నారని ఎస్పీ పేర్కొన్నారు. సాంకేతికతను మంచికి ఉపయోగించుకోవాలని, దాని వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలను గుర్తించి జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.అత్యాశే సైబర్ మోసాలకు ప్రధాన కారణమని ఎస్పీ తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, బహుమతులు, రుణాలు, ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో మోసగాళ్లు ప్రజలను ఆకర్షిస్తున్నారని చెప్పారు. డ్రగ్స్ కేసు, డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం సేకరించి ఆర్థికంగా మోసం చేస్తున్నారని వివరించారు.అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసాలపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తులను కూడా చైతన్యవంతం చేయాలని కోరారు.మహిళల రక్షణకు పోలీస్ అక్క కార్యక్రమం, షీ టీమ్స్, భరోసా కేంద్రం ద్వారా పోలీసులు పటిష్టంగా పనిచేస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రూరల్ ఎస్సై అనిల్ రెడ్డి, షీ టీమ్స్ ఎస్సై నీలిమ, పోలీసు సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెలుగులు పంచిన‘ఏకశిల’ కుటుంబం..!





- అనారోగ్యంతో ‘ఏకశిల’ ఫోటో స్టూడియో యజమాని వీరస్వామి మృతి
- నేత్రదానం చేసిన కుటుంబం
- అభినందించిన ఎమ్మెల్యే, మేయర్, ప్రజాప్రతినిధులు

జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

కెమెరా లెన్స్ వెనుక నిలబడి వేలాది జీవితాల ఆనందాలను చిత్రాలుగా మలిచిన ఆయన.. చివరికి తన జీవితంలోనూ ఓ గొప్ప జ్ఞాపకాన్ని మిగిల్చారు. కన్నుమూసిన తర్వాత కూడా తన చూపు ఆగిపోకుండా.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగై కొనసాగేందుకు నేత్రాలను దానం చేశారు. ‘ఏకశిల’ వీరస్వామి (76). గోదావరిఖని కళ్యాణ్ నగర్ లో ఏకశిల ఫోటో స్టూడియో, ఫ్రేమ్ వర్క్ పేరుతో 1976 నుంచి ప్రజలకు సేవలందిస్తున్న వీరస్వామి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మాత్రం తీవ్ర విషాదంలోనూ... ఆయన చూపు మాత్రం మరో ఇద్దరి కళ్లలోంచి ఈ ప్రపంచాన్ని చూడాలని... తండ్రి నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం మానవత్వానికి, నేత్రదాన స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.

### వెలుగులు పంచిన ఏకశిల కుటుంబం..

ఇంటి పెద్దను కోల్పోయిన విషాదంలోనూ... తండ్రి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి, ఇద్దరు అంధులకు వెలుగులు పంచారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు అవగాహన కల్పించగా.. భార్య విజయ, కుమారులు రాజేష్, వేణుమాధవ్, సంతోష్, నవీన్, వెంకటేష్, కోడళ్లు అనిత, కవిత, సుమలత, అరుణజ్యోతి, వీణ విషాదంలోనూ నేత్రదానానికి అంగీకరించారు. బుధవారం ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో వీరస్వామి కార్నియాలను సేకరించారు.

### ప్రతి ఇంటితో ‘ఏకశిల’ అనుబంధం..

1976లో వరంగల్ నుంచి గోదావరిఖనికి వచ్చిన వీరస్వామి.. కళ్యాణ్‌నగర్‌లో ‘ఏకశిల’ ఫొటో స్టూడియోను ఏర్పాటు చేశారు. కేవలం ఫొటోలు తీయడానికే పరిమితం కాకుండా.. ఫొటో ఫ్రేమ్ వర్క్ సేవలను కూడా అందిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యారు. ఎన్నో కుటుంబాల వేడుకలు, జీవితంలోని ముఖ్య ఘట్టాలను తన కెమెరాలో బంధించి జ్ఞాపకాలుగా అందించారు. ఇలా ప్రతి కుటుంబానికీ ‘ఏకశిల’ను దగ్గర చేసిన వీరస్వామి.. పట్టణంలో సౌమ్యుడిగా, అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కెమెరా లెన్స్‌తో ఇతరుల జ్ఞాపకాలను పదిలం చేసిన ఆయన.. ఇప్పుడు తన నేత్రాలతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగును నింపడం విశేషమని పలువురు కొనియాడారు.

### నివాళులర్పించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్..

ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నేత్రదాతకు నివాళులర్పించి కుటుంబాన్ని ఓదార్చారు. నేత్రదానం చేసినందుకు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. రామగుండం మేయర్ మహంకాళి స్వామి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్ గట్ల రమేష్, వివిధ పార్టీల నాయకులు తిప్పారపు శ్రీనివాస్, కౌశిక హరి, వ్యాళ్ల హరీష్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యామ్, కోశాధికారి రాజ్‌కుమార్, జర్నలిస్టులు విజయ్ కుమార్, పి.శ్యామ్ సుందర్, పూదరి కుమార్, డి.చంద్రశేఖర్, మామిడి సత్యనారాయణ, బైరమ్ సతీష్, సురభి శ్రీధర్ తదితరులు కుటుంబాన్ని అభినందించారు. వీరస్వామి పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

### మరణానంతరం మిగిలిన చూపు...

వీరస్వామి జీవితం ఫొటోలతో ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చింది. ఆయన మరణం మాత్రం నేత్రదానంతో మరింత గొప్ప సందేశాన్ని అందించింది. మనిషి జీవితం ముగిసినా.. అతని చూపు మరో మనిషి జీవితంలో కొనసాగవచ్చని వీరస్వామి కుటుంబం ఆచరణలో చూపించింది. విషాద సమయంలోనూ తండ్రి నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం సమాజానికి స్ఫూర్తిగా నిలిచింది.

## జమ్మికుంటలో ఈ నెల 9 నుండి ఎస్ జి ఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు

- మండల విద్యాధికారి ఎం .హేమలత

కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 02/అక్షరం న్యూస్:

జమ్మికుంట ఎంఆర్సి లో ఎంఈఓ ఎం .హేమలత అధ్యక్షతన ఎస్ జి ఎఫ్ సమావేశం నిర్వహించారు. మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారని ఎస్ జి ఎఫ్ సెక్రటరీ ప్రేమలత తెలిపారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) జమ్మికుంటలో ఈ నెల 9 నుండి 11 వరకు యు-14, యు-17 బాలబాలికలకు మండల స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోటీల షెడ్యూల్:

సెప్టెంబర్ 9: యు-14, యు-17 బాలికల విభాగం - ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ సెప్టెంబర్ 10: యు-14, యు-17 బాలుర విభాగం - ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ ్ సెప్టెంబర్ 11: యు-14, యు-17 బాలుర, బాలికల అథ్లెటిక్స్ పోటీలు

యు-14 కు 01-01-2013, యు-17 కు 01-01-2010 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని, మండల స్థాయిలో ఎంపికైన వారు



కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. పాఠశాలలు ఈ నెల 8వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని, అదే రోజు డ్రా తీస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో పీఈటీ లు వి.శ్రీలత, జి.రేణుక, జి.శ్రీను, హఫ్సా తదితరులు పాల్గొన్నారు.

వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్: మండల కన్వీనర్ ప్రేమలత, జెడ్ పి హెచ్ ఎస్ బాయ్స్ జమ్మికుంట - 8099690998

# రామగుండం కార్పొరేషన్ లో అభివృద్ధి పనులన్నీ నాణ్యతతో వేగంగా చేయాలి..

- మేయర్ మహంకాళి స్వామి



జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

అభివృద్ధి పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని జరుగుతున్నప్పుడు క్షేత్ర స్థాయిలో ఇంజనీర్లు పర్యవేక్షించాలని అన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకున్న పనులు త్వరితగతిన గ్రౌండ్ చేయాలని అన్నారు. పని దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రారంభించకుండా జాప్యం చేస్తే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతి స్వరూప్ తో ఎ. ఇ. లు మీర్, మనోజ్ ,అన్వేష్ , సౌమ్య నరేష్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి సీఐగా కే. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ



హన్మకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ ఎల్కతుర్తి/ సెప్టెంబర్ 02/అక్షరం న్యూస్:-

ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్గా కే. శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్లో ఉన్న ఈయనను ఎల్కతుర్తి సర్కిల్కు బదిలీ చేయడంతో నూతన సీఐగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎల్కతుర్తి పోలీస్ సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్కు పూలబొకే అందించి ఘనంగా స్వాగతం పలికారు. గతంలో ఎల్కతుర్తి సీఐగా పనిచేసిన పులి రమేష్ హన్మకొండలోని మహిళా పోలీస్ స్టేషన్కు బదిలీపై వెళ్లారు.నూతన సీఐ శ్రీనివాస్కు స్వాగతం పలికిన వారిలో ఎల్కతుర్తి ఎస్సై నరసింహారావు, ముల్కనూర్ ఎస్సై రాజు, వంగర ఎస్సై దివ్యతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం..

- ప్రజల కోసం నిరంతరం కృషి షేక్ చాంద్ పాషా



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: కొండాపూర్ అంజయ్య నగర్ డివిజన్కు చెందిన పలువురు నాయకులు, మహిళలు ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా ని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు, వితంతు, వికలాంగుల పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర ప్రజాసమస్యలను చాంద్ పాషా దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం దిశగా ముందుకు తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన

- సిరిసిల్ల కు తరలిన ముస్తాబాద్ బీఆర్ఎస్ శ్రేణులు
- ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలపై ఆందోళన



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -02(అక్షరం న్యూస్ )

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ముస్తాబాద్ మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారుకాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలతో కూడిన భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్దపెట్టున నినాదాలు హోరెత్తించాయిఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి భూగర్భ గనుల ప్రైవేటీకరణ వార్తలు పూర్తిగా అవాస్తవం

- భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ లేదు
- సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 2, పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సింగరేణి భూగర్భ బొగ్గు గనులను ప్రైవేటుపరం చేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటీకరించేందుకు ప్రస్తుతం సంస్థ వద్ద ఎటువంటి ప్రతిపాదన పరిశీలనలో లేదని పేర్కొంది.బాధ్యతాయుతమైన ప్రభుత్వ రంగ సంస్థగా, మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ గనులు, 17 ఓపెన్కాస్ట్ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. తెలంగాణతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బొగ్గును సరఫరా చేస్తూ దేశ ఇంధన భద్రతకు, పారిశ్రామిక అభివృద్ధికి నిరంతరం తోడ్పడుతున్నట్లు వెల్లడించింది.

### నష్టాల్లో ఉన్నా భూగర్భ గనుల కొనసాగింపు

సింగరేణిలోని భూగర్భ గనులు ఆర్థికంగా నష్టాల్లో ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రాంతంలో ఉపాధి కల్పన, ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని నష్టాలను సాధ్యమైనంత మేర తగ్గిస్తూ వాటిని కొనసాగిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.భూగర్భ గనులను మూసివేయడం లేదా ప్రైవేటుపరం చేయడం కాకుండా వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, నిర్వహణ వ్యయాలను తగ్గించడం ద్వారా సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది.

### శాంతిఖని గనిపై ఈఓఐ కేవలం పైలట్ అధ్యయనం కోసమే

భారీ నష్టాల్లో కొనసాగుతున్న శాంతిఖని భూగర్భ గనిలో ఉత్పత్తి కార్యకలాపాలను ఎండీఓ (మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్) విధానంలో నిర్వహించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించగలమా, నష్టాలను నివారించగలమా అనే అంశాన్ని అధ్యయనం చేసేందుకు మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా ఒక ప్రతిపాదనను రూపొందించినట్లు యాజమాన్యం వివరించింది.ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 2వ తేదీన ఈఓఐ (ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్) ప్రకటన జారీ చేసి, ఆసక్తిగల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించడం జరిగింది. తొలుత జనవరి 15వ తేదీ వరకు గడువు ఇవ్వగా ఏ సంస్థ కూడా ఆసక్తి వ్యక్తం చేయలేదు. అనంతరం గడువును జనవరి 22వ తేదీ వరకు పొడిగించగా ఒక సంస్థ మాత్రమే ముందుకొచ్చింది. అయితే తదుపరి దశలో ఆ సంస్థ కూడా ఈ ప్రక్రియలో కొనసాగేందుకు సంసిద్ధత వ్యక్తం చేయలేదు. ఈ ప్రతిపాదనకు తగిన స్పందన లభించకపోవడంతో దానిని విరమించుకున్నట్లు సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది.శాంతిఖని గనికి సంబంధించి జారీ చేసిన ఈఓఐని ఆధారంగా చేసుకుని సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటుపరం చేస్తోందని ప్రచారం చేయడం వాస్తవ విరుద్ధమని యాజమాన్యం పేర్కొంది. శాంతిఖని గనికి సంబంధించిన ఈఓఐ ప్రక్రియను కూడా ఇప్పటికే విరమించుకున్నామని తెలిపింది.భూగర్భ గనులను మరింత సమర్థ వంతంగా నిర్వహించడం, నష్టాలను తగ్గించడం, సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చడం ద్వారా తెలంగాణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలను పరిరక్షించడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉపాధి కల్పించడమే సింగరేణి యాజమాన్యం ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

# తబితా అనాథాశ్రమంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు






జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలను రామగుండం పట్టణ పవన్ కళ్యాణ్ ప్రజాసేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తబితా అనాథాశ్రమంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ హాజరై పవన్ కళ్యాణ్ ప్రజా సేవలను కొనియాడారు. భవిష్యత్తులో పవన్ కళ్యాణ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే కాకుండా దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమానులు గట్టు శ్రీనివాస్, తాటిపాముల రవి, కట్ల సురేష్, వడ్లూరి సాయికుమార్, కాసర్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.శ్రీయాన్ష్ జన్మదినం సందర్భంగా అన్నదానంపవన్ కళ్యాణ్ అభినందనల సంఘం రామగుండం పట్టణ అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్ కుమారుడు గట్టు శ్రీయాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని తబితా అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అప్పాసి శ్రీనివాస్ పాల్గొని చిన్నారులకు అన్నప్రసాదం వడ్డించారు. శ్రీయాన్ష్ జన్మదినం సందర్భంగా అనాథాశ్రమంలోని పిల్లలకు అన్నదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గట్టు శ్రీనివాస్, గట్టు స్రవంతి, గట్టు సంతోషిని, గట్టు శ్రీయాన్ష్, కట్ల సురేష్, దేవర విక్రమాదిత్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక కోడ్లలో సవరణలు చేయాలి

- బీఎంఎస్
- కేంద్ర కార్మిక మంత్రికి వినతిపత్రం.. అవసరమైన మార్పులు చేస్తామని హామీ

జ్యోతి నగర్ ఎన్టిపిసి, సెప్టెంబర్ 2 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

: కార్మికుల ప్రయోజనాలు, సామాజిక భద్రత, ఉపాధి రక్షణకు సంబంధించిన అంశాలపై భారతీయ మజ్దూర్ సంఘ్ కేంద్ర నాయకత్వం కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో సమావేశమైంది. కొత్త కార్మిక కోడ్లలోని కార్మిక వ్యతిరేక నిబంధనలను సవరించాలని బీఎంఎస్ ప్రతినిధులు మంత్రిని కోరారు. ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.ఆగస్టు 17న బీఎంఎస్ దేశవ్యాప్తంగా నిర్వహించిన ఉద్యమం నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. కొత్త కార్మిక కోడ్లలోని పలు నిబంధనలపై తమ అభ్యంతరాలు, డిమాండ్లను ప్రతినిధి బృందం మంత్రికి వివరించింది. బీఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడు ఎస్. మల్లేశం, ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్ పాండే, సంఘటనా కార్యదర్శి బి. సురేంద్రన్, మాజీ అధ్యక్షుడు హిరణ్య పాండ్యా, సంజీవ్ నారాయణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.కార్మికులకు సామాజిక భద్రతను మరింత విస్తరించేందుకు ఉద్యోగుల భవిష్య నిధి వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.30 వేలకు పెంచాలని బీఎంఎస్ డిమాండ్ చేసింది. అలాగే బోనస్, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం వేతన పరిమితిని రూ.21 వేల నుంచి రూ.42 వేలకు పెంచాలని కోరింది.కార్మికులను ఏకపక్షంగా తొలగించకుండా రక్షణ కల్పించేందుకు స్థిర ఆదేశాలు, కార్మికుల తొలగింపు, సంస్థల మూసివేతకు సంబంధించిన నిబంధనలు వర్తించే సంస్థల్లో కార్మికుల సంఖ్య పరిమితిని 300 నుంచి 100కు తగ్గించాలని కోరింది. శాశ్వత స్వభావం కలిగిన పనులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, నిర్ణీత కాల వ్యవధి ఉపాధి విధానాన్ని విచక్షణారహితంగా వినియోగించకుండా నియంత్రించాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.కార్మిక సంఘాల గుర్తింపుకు సంబంధించిన 51 శాతం సభ్యత్వ నిబంధనను పునఃపరిశీలించడం, చర్చల మండలికి సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయడం, నిర్ణీత గడువులో నమోదు జరగని సందర్భంలో స్వయంచాలకంగా నమోదు అయినట్లు పరిగణించే అవకాశం కల్పించడం, 'కార్మికుడు' నిర్వచనంలోని వేతన పరిమితిని సవరించడం, సమ్మె హక్కుకు సంబంధించిన నోటీసు నిబంధనలను సడలించడం వంటి పలు డిమాండ్లను బీఎంఎస్ ముందుంచింది.బీఎంఎస్ సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించిన కేంద్ర మంత్రి మాండవీయ, ప్రతినిధులు లేవనెత్తిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన చట్టపరమైన సవరణలు, మార్పులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తదుపరి దశలో వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్లోని నిబంధనలపై బీఎంఎస్ కేంద్ర నాయకత్వంతో ప్రత్యేక ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.దేశంలోని కోట్లాది మంది కార్మికుల హక్కులు, సామాజిక భద్రత, గౌరవప్రదమైన ఉపాధి కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ నిర్మాణాత్మకంగా, దృఢ సంకల్పంతో తన పోరాటాన్ని కొనసాగిస్తుందని అఖిల భారతీయ ఠేకా మజ్దూర్ మహాసంఘ్ అధ్యక్షుడు కంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సచిన్ మేంగాళే ఎన్టిపిసి కాంట్రాక్ట్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ త్రిదండపాణి శ్రీనివాస్ తెలిపారు.

# మండలంలో ఆకస్మికంగా పర్యటించిన డిఆర్డిఏ అధికారి





ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 02 అక్షరం న్యూస్

ఓదెల మండలంలోని హరిపురం గ్రామంలో బుధవారం ఆకస్మికంగా పర్యటించిన డిఆర్డిఏ జిల్లా అధికారి కాలిందని ఓదెల మండలం హరిపురం, గోపరపల్లి గ్రామాల్లో పర్యటించి వికాసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజు గర్. అండ్ అజీవీక మిషన్ గ్రామీణ పథకం లో నిర్మించే ఫారం పాండ్ పనులు,నర్సరీ, ఇంకుడు గుంతల నిర్మాణం పనులను పరిశీలించారుఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్ మండల్ సూపరింటెండెంట్, ఏపీవో మరియు టిఏ లు,గోపరపల్లి సర్పంచ్ .రవి వార్డ్ మెంబర్ అజయ్ పంచాయతీ కార్యదర్శి లు వెంట ఉన్నారుజలసిరి లో భాగం గా అన్ని ఇండ్లకు,బోరింగ్ ల వద్ద ఇంకుడు గుంతలు, నిర్మించుకోవాలని ,మొక్క ల ప్లాంటేషన్ పూర్తి చేయాలని,ప్రతి గ్రామం లో ప్రతి రోజు 50మంది కూలీలు పనికి వచ్చే విధం గా చూడాలని సూచనలు చేశారు.

## రామగుండంలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నిలుపుదలపై ప్రయాణికుల హర్షం

- ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రయాణికుల ప్రత్యేక కృతజ్ఞతలు



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

రామగుండం ప్రాంత ప్రయాణికుల చిరకాల కోరిక నెరవేరింది. కాన్పూర్--మదురై మధ్య నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్లు 01925/01926)కు రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలుపుదల కల్పించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబర్ 2 నుంచి ఈ రైలు రామగుండం మీదుగా రాకపోకలు సాగించనుంది.కాన్పూర్ నుంచి బయలుదేరే 01925 నంబర్ రైలు రామగుండం రైల్వే స్టేషన్‌కు ఉదయం 5.20 గంటలకు చేరుకోనుండగా, మదురై నుంచి వచ్చే 01926 నంబర్ రైలు రామగుండానికి అర్ధరాత్రి 1.15 గంటలకు చేరుకోనుంది. వరంగల్, ఖమ్మం, విజయవాడ, గూడూరు, రేణిగుంట మీదుగా మదురై వరకు ఈ రైలు ప్రయాణించనుండటంతో రామగుండం, పెద్దపల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు మరింత సౌకర్యం కలగనుంది.రామగుండం ప్రాంత ప్రయాణికుల చిరకాల కోరికను నెరవేర్చేందుకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకున్నారని ప్రయాణికులు తెలిపారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌తో సంప్రదింపులు జరిపి రామగుండం రైల్వే స్టేషన్‌లో ఈ రైలుకు నిలుపుదల కల్పించేందుకు కృషి చేసిన ఎంపీకి ప్రయాణికుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ రైలు నిలుపుదలతో రామగుండం ప్రాంత ప్రజలకు ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాలకు ప్రయాణం మరింత సులభతరం కానుందని వారు పేర్కొన్నారు. రైల్వే సౌకర్యాల అభివృద్ధిలో భాగంగా రామగుండం రైల్వే స్టేషన్‌కు మరిన్ని రైళ్ల నిలుపుదలలు, ప్రయాణికులకు అవసరమైన ఇతర సౌకర్యాలు కల్పించేందుకు భవిష్యత్తులోనూ ఎంపీ ఇదే విధంగా చొరవ చూపాలని ప్రయాణికులు కోరారు.రామగుండం ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి రైల్వే శాఖ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రయాణికుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థినులకు 19 సైకిళ్లు, 30 యోగా చాపలు పంపిణీ




జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: విద్యార్థినుల విద్యాభ్యాసంతో పాటు వారి ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి తోడ్పడేలా ఎన్టీపీసీ రామగుండం సామాజిక బాధ్యత కార్యక్రమాల ఆధ్వర్యంలో బుధవారం సైకిళ్లు, యోగా చాపలు పంపిణీ చేశారు. రామగుండంలోని ఎఫ్‌సీఐ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 19 సైకిళ్లు, 30 యోగా చాపలను అందజేశారు.రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు, నగర మేయర్ మహంకాళి స్వామి సూచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ కందుల స్వరూప పాలకుర్తి మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. విమల పాల్గొని విద్యార్థినులకు సైకిళ్లు, యోగా చాపలు అందజేశారు.ఈ సందర్భంగా కందుల స్వరూప సతీష్, టి. విమల మాట్లాడుతూ సైకిళ్లతో విద్యార్థినులు పాఠశాలకు సులభంగా రాకపోకలు సాగించడంతో పాటు విద్యాభ్యాసానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. యోగా చాపలు విద్యార్థినుల శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.విద్యార్థినుల విద్య, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతున్న ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యానికి, సామాజిక బాధ్యత విభాగానికి పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, సమాజం కలిసి విద్యార్థుల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ పాలనను ప్రతిపక్షాలు సైతం మెచ్చుకున్నాయి

- ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞంతో ప్రజల గుండెల్లో నిలిచిన నేత వైఎస్ఆర్: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం రామగుండం ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ నాయకుడు మెంటం ఉదయ్ రాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ పాలనలో ప్రజా సంక్షేమం, రైతుల అభ్యున్నతి, పేద విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉన్నత విద్య అందించడంతో పాటు జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. ఆయన చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు.రామగుండంలో వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని నగర మేయర్ మహంకాళి స్వామిని ఎమ్మెల్యే కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన.. హామీలకు మోక్షం లేదు

- ప్రజా సమస్యలను గాలికొదిలి ప్రచారానికే ప్రాధాన్యం: బీజేపీ నేతల విమర్శలు
- ఆరు గ్యారంటీల అమలుపై నిలదీసిన నాయకులు




జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని, ప్రచారం ఎక్కువగా.. ఆచరణ తక్కువగా ఉందని ఆరోపించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజలకు మేలు చేయడం కంటే సమస్యలను మరింత పెంచిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. "దినదిన గండం.. నూరేళ్ల ఆయుష్షు" అన్నట్టుగా ప్రభుత్వ పరిస్థితి తయారైందని, "చారాన కోడికి బారాన మసాలా" అన్న చందంగా ప్రచారం తప్ప ప్రజలకు కనిపించే ఫలితాలు లేవని ఎద్దేవా చేశారు. ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వం రక్షక పాలనగా కాకుండా రాక్షస పాలనగా మారిందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే వెయ్యి రోజులుగా ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని ఆరోపించారు. పేదల ఇళ్ల కూల్చివేత, దేవాలయాల తొలగింపు, చెట్ల నరికివేత వంటి చర్యలు ప్రజల్లో ఆందోళనకు కారణమవుతున్నాయని సంధ్యారాణి అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారి ఆవేదనను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. "పాము తన పిల్లలను తానే తిన్నట్లు.. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు" కాంగ్రెస్ పాలన సాగుతోందని వ్యాఖ్యానించారు.

### ఆరు గ్యారంటీలు.. ఆరు ప్రశ్నలు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై బీజేపీ నాయకులు ప్రశ్నల వర్షం కురిపించారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామని ప్రకటించిన మహాలక్ష్మి హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతుకు ఎకరానికి రూ.15 వేల చొప్పున అందిస్తామని చెప్పిన రైతు భరోసా పథకంలో ఆంక్షలు, అర్హతల పేరుతో అనేక మంది రైతులు పూర్తి ప్రయోజనం పొందలేకపోతున్నారని విమర్శించారు.గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చినా, అర్హత ఉన్న కుటుంబాలందరికీ సక్రమంగా ప్రయోజనం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల హామీ కింద ఇల్లు లేని పేదలకు రూ.5 లక్షలు అందిస్తామని చెప్పి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.యువ వికాసం పేరుతో విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా, యువతకు ఉద్యోగాల హామీలు ఇచ్చారని గుర్తుచేస్తూ.. యువతకు హామీలు కాదు, ఉద్యోగ నియామకాలు, నోటిఫికేషన్లు, సమయానికి పరీక్షలు కావాలని అన్నారు. చేయూత కింద పింఛన్ రూ.4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేసి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు."ఆరు గ్యారంటీలు ప్రకటించడం సులువు.. వాటిని పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన పరీక్ష" అని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.మరోవైపు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల దేశ ప్రజలకు నిరంతరం ప్రయోజనాలు అందుతున్నాయని కందుల సంధ్యారాణి అన్నారు. మోదీ పాలన దేశ ప్రజలకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. కేంద్ర పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని తెలిపారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రచారాలకు స్వస్తి పలికి, ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపాలని, లేదంటే ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరించారు.సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు సులువ లక్ష్మీ నరసయ్య, లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నరసయ్య, మహిళా మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు చిలుక భారతి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్, అంతర్గాం మండల అధ్యక్షుడు బోడకుంటి సుభాష్, పాలకుర్తి మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ గౌడ్, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణతో పాటు సులువ పద్మ, కోడూరు రమేష్, బియ్యాల మహేందర్, కొట్టే నరేష్, అందే రాజ్‌కుమార్ చారి, శీతకారి గంగరాజు, జక్కుల ప్రవీణ్--పద్మ, ఎల్తూరి సరిత--రాజయ్య, పాకాల నరసింహారెడ్డి, హనుమాన్ల వెంకటేష్, అంకరి భరత్, బూడిద హర్ష, జక్కన బాలు, బుంగ మహేష్, జనగామ శివరాం, లింగాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ రిసర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

- భూ రిసర్వేను పకడ్బందీగా చేపట్టాలి అదనపు కలెక్టర్ యన్. రవి..



హన్మకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబరు 02/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి గ్రామంలో బుధవారం నిర్వహిస్తున్న భూ రిసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ ఎన్. రవి పరిశీలించారు. రిసర్వే జరుగుతున్న తీరును రెవెన్యూ అధికారులు చేపడుతున్న చర్యలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ రిసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. భూ రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయిలో వివరాలను సరిచూసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. రైతులు, భూ యజమానులు అధికారులకు సహకరించాలని కోరారు.రిసర్వే సందర్భంగా స్థానిక సమస్యలు భూముల హద్దులు రికార్డులకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించారు. భూ రిసర్వే ద్వారా భూముల వివరాలు మరింత స్పష్టతతో నమోదు కావడంతో భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ రాజేష్, గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, సర్వేయర్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

## 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన



కరీంనగర్/హుజూరాబాద్,/ సెప్టెంబర్ 02/అక్షరం న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తైన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం భారీ నిరసన చేపట్టారు.ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 3 వేల మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపిస్తూ '420 హామీలు - 420 ఫిట్లు' ఫ్లెక్సీ ప్రదర్శించారు. 'కాంగ్రెస్ బాకీ కార్డు' పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాలయాల్లో ప్రమాణాలు చేసి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని, మహిళలకు రూ.2,500, తులం బంగారం, రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, పింఛన్ల పెంపు, ఉద్యోగాల భర్తీ వంటి ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్, జమ్మికుంట పిఏసిఎస్ చైర్మన్ పోనగంటి సంపత్, వాల బాలకిషన్ రావు, పోల్నేని సత్యనారాయణ రావు తదితర నాయకులు, వివిధ మండలాల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.


## వెయ్యి రోజుల ప్రజా పాలనపై రామగుండం ఎమ్మెల్యే ప్రయాణికులకు మిఠాయిల పంపిణీ



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో గోదావరిఖని బస్టాండ్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు.బస్సుల్లో ప్రయాణిస్తున్న వారితో రాజ్ ఠాకూర్ స్వయంగా మాట్లాడి వారి ప్రయాణ అనుభవాలు, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రయాణికులకు మిఠాయిలు పంపిణీ చేసి వెయ్యి రోజుల ప్రజా పాలన వేడుకల్లో వారిని భాగస్వాములను చేశారు.ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులు ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం తమ రోజువారీ ప్రయాణ ఖర్చులను తగ్గించడంతో పాటు ఆర్థికంగా ఎంతో ఉపశమనం కల్పిస్తోందని తెలిపారు.వెయ్యి రోజుల పాలన సందర్భంగా ప్రజల మధ్యకు వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం, సంక్షేమ పథకాల ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.




# తారకరామ కాలనీ దగ్గర టి పై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి




ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 02 అక్షరం న్యూస్

జిల్లా కేంద్రానికి మండలానికి వివిధ గ్రామాలకు అనుసంధానం అయ్యేందుకు ప్రజల సౌకర్యం ప్రయాణికుల సౌకర్యం కోసం ఓదెల తారకరామా కాలనీ గేటు వద్ద టి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కలెక్టర్కు బుధవారం వినతిపత్రం ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో మంజూరు కాబోతున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నమూనాలను మార్చాలని ప్రస్తుతం డిఐటి సిక్స్ కాలువ నుండి రైల్వే ట్రాక్ పై నుండి హైస్కూల్ రోడ్డులోని పెంట ఐలయ్య ఇంటి వరకు మంజూరు అయినదని ఇట్టి బ్రిడ్జి కి తారకరామ కాలనీ గేటు ప్రక్కన గల అప్రోచ్ రోడ్డుపై బ్రిడ్జి పల్లె ప్రకృతి వనం దగ్గర ఫ్లైఓవర్ కి అటాచ్ చేయడం వలన తారకరామ కాలనీ గేటు వద్ద అండర్ బ్రిడ్జి అవసరం ఉండదని అలాగే బ్రిడ్జ్ కింద నుండి రోడ్ అవసరం ఉండదని అంతేకాకుండా జిల్లా కేంద్రం నుండి నేరుగా తారకరామ కాలనీ వద్ద నుండి నిర్మాణం చేస్తే ఎలాంటి రైల్వే గేటు అడ్డంకి లేకుండా జమ్మికుంట మరియు రూప్ నారాయణపేట బ్రిడ్జిపై నుండి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలపడం జరిగిందని అన్నారు. వెంటనే మా సూచనలను మన్నించి తగిన విధంగా టీ బ్లడ్జిని అన్ని




విధాలుగా ప్రజలకు సౌకర్యంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం విప్ ఎమ్మెల్యే కి మరియు జిల్లా కలెక్టర్కు వినతి పత్రం చేయడం జరిగిందని దీనికి వాళ్ళు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు.

# బావిలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



- తప్పిన భారీ పెను ప్రమాదం
- ప్రమాద సమయంలో బస్సులో 52 మంది ప్రయాణికులు



చిగురుమామిడి/సెప్టెంబర్ 02, అక్షరం న్యూస్,

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నుండి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గురువారం సుందరగిరి గ్రామ శివారులో హుస్నాబాద్ డిపోకు చెందిన ఏపీ29 జెడ్ 2426 ఆర్టీసీ బస్సు,స్టీరింగ్ రాడ్ విరగడంతో బస్సు అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. రహదారి పక్కనే ఉన్న స్థానిక రైతు కవాటీ బక్కయ్య చెందిన వ్యవసాయ బావిలోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు ప్రమాద సమయంలో ప్రయాణికులు 52 మంది ఉన్నారు.బస్సులో ప్రయాణిస్తున్న 12 మంది ప్రయాణికులకు గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఘటనా స్థలానికి హుటాహుటిన స్థానిక ఎస్సై జగదీశ్వర్, తహసిల్దార్ కనకయ్య చేరుకొని, గాయపడిన వారిని 108 వాహనంలో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## విద్యార్థులకు ఏక రూప దుస్తువులు పంపిణి



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /సెప్టెంబర్ -02(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండలం మొఱ్ఱపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ భూక్యా రాజు నాయక్ ఏక రూప దుస్తువులు పంపిణి చేశారు విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు అందించే సౌకర్యాలను, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమం లో ఎస్ ఎం సి చేర్మెన్ భూక్యా అనిత, కార్యదర్శి రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## లబ్ధిదారి ఇంటికే పాలనాధికారులు మరణ ధ్రువీకరణ పత్రం అందించిన సర్పంచ్



ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 02అక్షరం న్యూస్

ఓదెల గ్రామ సర్పంచ్ వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల ఇంటి వద్దకే వెళ్లి మరణ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తూ. అందరి మన్నలను పొందుతున్న సర్పంచ్ సతీష్ కనకిరెడ్డి ఈ సందర్భంగా ఇటీవల కాలంలో అనారోగ్యం తో మరణించిన అల్లం దిలీప్ కుమార్ కుటుంబ సభ్యులకు సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మరణ ధృవీకరణ పత్రం బుధవారం మృతుని ఇంటి వద్దకే వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు.మృతుని తల్లి దండ్రులు సత్తయ్య రజిత సోదరులు చందు సందీప్ ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా కుటుంబం బాధలో ఉండగా సర్పంచ్ పాలకవర్గం కుటుంబ సభ్యులను పరామర్శించి వారే స్వయంగా ఇంటికి వచ్చి మరణ ధృవీకరణ పత్రం ఇవ్వడం చాలా బాగా అనిపించింది అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ కనికిరెడ్డి సతీష్,వార్డ్ సభ్యులు దూలం సదానందం మరియు అల్లం సతీష్,రామినేని రాయమల్లు,రాజీరు మృతుని బంధువులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణం కోసం మాస్టర్ ప్లాన్



ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 02 అక్షరం న్యూస్

ఓదెల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి పునర్నిర్మాణం లోభాగంగా బుధవారం శ్రీ.శైల ఆలయ దర్శనం తెలంగాణ దేవాలయ శాఖ స్థపతి వల్లినయాగన్ తో కలిసి శ్రీశైల జగద్గురు డా. చెన్న సిద్ధరామ పండితారాధ్య భగవత్పదులు ని మర్యాదపూర్వకంగా కలిసి ఓదెల మల్లన్న ఆలయం యొక్క మాస్టర్ ప్లాన్ను క్షుణ్ణంగా వివరించిన ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఈ కార్యక్రమంలో ఓదెల మల్లన్న ఆలయ ఈ.వో, ప్రధాన అర్చకులు మరియు తదితరులు పాల్గొన్నారు...




## కొమిర గ్రామంలో సన్రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ఓదెల సెప్టెంబర్ 02అక్షరం న్యూస్

ఓదెల మండలంలోని పెద్ద కొమిర. గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం కరీంనగర్ సన్రైజ్ హాస్పిటల్ సౌజన్యంతో గ్రామ సర్పంచి గోలి లింగారెడ్డి మరియు ఉపసర్పంచి మూల సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు డాక్టర్ రవళి సమక్షంలో వైద్య బృందం సుమారు 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సేవలందించారు ఈ శిబిరంలో ఈసీజీ ఆర్బీఐ షుగర్ కీళ్ల నొప్పులు బిపి తదితర పరీక్షలు మరియు సాదరణ వైద్య పరీక్షలు చేశారు రోగుల నుంచి రక్తం నమూనా సేకరించి పలు పరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రోగులను పరీక్షించి రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ శిబిరం నిర్వహించినట్లు సర్పంచ్ లింగారెడ్డి ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి వైద్య సిబ్బంది తెలిపారు ఈ కార్యక్రమంలో సన్రైజ్ హాస్పిటల్, కరీంనగర్ సిబ్బంది మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు కార్యదర్శి తోపాటు తదితరులు పాల్గొన్నారు



## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్..




హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 02/అక్షరం న్యూస్:-

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు, దళిత ప్రజాసంఘాల నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను కించపరిచే విధంగా అమర ప్రసాద్ రచించిన పుస్తకంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసి దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడని అన్నారు. అలాంటి మహనీయుడిపై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. కులాలు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అంబేద్కర్‌ను కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి, మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, నాయకులు పోర్నందుల సురేష్, ఇల్లందుల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## దుగ్యాల ప్రదీప్ కుమార్ జన్మదిన వేడుకలు



ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 02 అక్షరం న్యూస్

ఓదెల మండల కేంద్రంలో బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి అసెంబ్లీ ఇన్చార్జి దుగ్యాల ప్రదీప్ కుమార్ జన్మదిన వేడుకలను భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు కారంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ దుగ్యాల ప్రదీప్ కుమార్ నిండు నూరేళ్లు అష్ట ఐశ్వర్యాలు, మరియు ఉన్నత పదవులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకున్నరు మరియు ఓదెల మండల ప్రజల తరపున శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్, తీర్థాల కుమార్, మండల ప్రధాన కార్యదర్శి మేరుకు సారంగం, ఉపాధ్యక్షులు రామినేని రాజేంద్రప్రసాద్, పోలోజు శ్రీహరి, బూత్ అధ్యక్షులు వంగరి చందు, మేకల రవి, శాతర్ల కుమార్, తిరుపతి, రామినేని శివ, కృష్ణ, శివప్రసాద్, అనిల్, తదితరులు బిజెపి నాయకులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ ధర్నాలు సిగ్గుచేటు

- **కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్ గౌడ్**

కరీంనగర్/హుజురాబాద్/సెప్టెంబర్ 02/అక్షరం న్యూస్ : పదేళ్లు ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ ప్రజాపాలనపై ధర్నాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్ గౌడ్ అన్నారు. 1000 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వెయ్యి రోజుల్లో వెయ్యి రూపాయలు కూడా తేలేదని విమర్శించారు.



అధికారిక క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ ఫోటో తొలగించి సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాలని, లేదంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు.కాంగ్రెస్ పథకాలను స్వయంగా పంచుతూనే పథకాలు అందడం లేదనడం విడ్డూరమని, దళిత సీఎం, డబుల్ బెడ్రూం, 3 ఎకరాల భూమి, కేజీ టు పీజీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని అన్నారు. కౌశిక్ రెడ్డి ఇప్పటికైనా డ్రామాలు ఆపాలని లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు.

## కొప్పూర్‌లో ఎస్ఐఆర్ ఫారాల పరిశీలన

- ఆన్‌లైన్‌లో వివరాల సవరణ
- ఓటర్ల సమస్యలను పరిష్కరించిన రెవెన్యూ అధికారులు...



హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 02 /అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఎస్ఐఆర్ ఓటర్ల ఫారాలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. నయాబ్ తహసీల్దార్ సూర్య ఆధ్వర్యంలో ఓటర్ల నుంచి ఫారాలను స్వీకరించి. అందులోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఫారాల్లో ఉన్న తప్పులను గుర్తించి. వాటిని ఆన్‌లైన్‌లో సరిచేసి వివరాలను అప్‌డేట్ చేశారు. ఈ సందర్భంగా ఓటర్లు తమ ఫారాల్లో నమోదైన వివరాలను పరిశీలించుకుని ఏవైనా తప్పులు లేదా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీధర్, జీపీఓ అనూష, జ్యోతి, బీఎల్ఓ తాళ్లపల్లి మల్లయ్యతో పాటు రెవెన్యూ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు





- **ఎమ్మెల్యే కాంతారావు**

మద్నూర్ / సెప్టెంబర్ 02 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

డోంగ్లీ మండల తహసీల్ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేయడం జరిగింది. బుధవారం రోజున తహసీల్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే కాంతారావు కు తహసీల్దార్ రంజిత్ కుమార్, గిర్ధవార్ సాయి బాబా పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కాంతారావు స్మార్ట్ కార్డులు వచ్చిన వారికి అందజేయడం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అందించడం జరుగుతుందని తెలిపారు. 10 ఏళ్ళ బి. ఆర్. ఎస్. ప్రభుత్వ హయాంలో ఒక్క కుటుంబానికి కూడా నూతన రేషన్ కార్డు అందించకుండా బడుగు బలహీన వర్గాలకు అందకుండా కాలయాపన చేసింద్రు అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేద ప్రజలకు వారికి అవసరమగు సంక్షేమ పథకాలు అన్ని వర్గాల వారికి అందించి సమన్వయ న్యాయం లబ్ధిచేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఎన్నో ఏళ్ళ నుండి ఎదురు చూస్తున్న నూతన రేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి మంజూరు చేసి ఇవ్వడం తో పాటు వారికి రేషన్ స్మార్ట్ కార్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. స్మార్ట్ కార్డుపై స్కాన్నర్ ఉండటం తో అ రేషన్ కార్డులో ఉన్నటువంటి కుటుంబ సభ్యుల పేర్లు తెలువడం జరుగుతుందని తెలిపారు. అలాగే పేదలకు అత్యవసరమగు ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం లో అన్ని వర్గాల సంక్షేమం కొరకు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, ఇండ్ల నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు లబ్దిదారుల కుటుంబ సభ్యుల యొక్క ఖాతాలలో జామ చేస్తున్న విషయాన్నీ తెలిపారు. ప్రతి ఇంటికీ ప్రతి నేల 200 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. రైతన్నలకు పెద్ద పీఠ వేస్తూ వారికి 2 లక్షల లోపల ఉన్నటువంటి రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం ధి అని తెలిపారు. నియోజక వర్గంలో విద్య, వైద్యం పై ప్రత్యక దృష్టి సాధించి నియోజక వర్గం అభివృద్ధికి తొడ్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి రేషన్ స్మార్ట్ కార్డులు రావడం తో లబ్ధిదారులు సంతోష వ్యక్త పర్చడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే కాంతారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజానన్ దేశాయి, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు బాచ వార్ లక్ష్మణ్ పటేల్, డోంగ్లీ సర్పంచ్ కుటుంబ సభ్యులు, మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, చాంద్ పటేల్, మొఘ సర్పంచ్ బస్వంత్ పటేల్, శివ రెడ్డి ( లింబుర్ సర్పంచ్ ), చాంద్ పటేల్, విలాస్ గైక్వాడ్, ముల్తాని పటేల్ ( సిర్పూర్ ), గౌస్ పటేల్, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి గణిత విజ్ఞాన మేళాలో సత్తా చాటిన జమ్మికుంట శిశు మందిర్ విద్యార్థులు



కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 02/అక్షర న్యూస్ :

శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ముధోల్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత విజ్ఞాన మేళాలో శ్రీ సరస్వతీ శిశు మందిర్, జమ్మికుంట విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు.ఈ మేళాలో 7వ తరగతికి చెందిన చిరంజీవి వ్యోమిక, చిరంజీవి శాన్విక, 4వ తరగతికి చెందిన చిరంజీవి శివ ప్రసాద్ లు ద్వితీయ బహుమతులు సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తెచ్చారు.బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రబంధకారిణి, సమితి సభ్యులు, పాఠశాల ప్రధానాచార్యులు గుడికందుల సుదర్శన్ , విద్యార్థుల తల్లిదండ్రులు ఆచార్య బృందం అభినందించారు.


## మర్రివానిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

- జమ్మికుంట ఆదిత్య, అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహణ
- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం
- ఆదిత్య అమృత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ .దేవేందర్ రెడ్డి




కరీంనగర్/ఇల్లందకుంట/సెప్టెంబర్ 02/అక్షరం న్యూస్ :

మండలం మర్రివానిపల్లి గ్రామంలో బుధవారం రోజున జమ్మికుంట ఆదిత్య, అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు జనరల్ మెడిసిన్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్, న్యూరాలజిస్ట్ డాక్టర్ భరత్, గైనకాలజిస్ట్ డాక్టర్ గ్రీష్మ పాల్గొని గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పూర్తి ఉచితంగా అందజేశారు.ఇంత గొప్ప సేవా కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించిన గ్రామ సర్పంచ్ మర్రి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ కడారి పద్మ - నవీన్, వార్డు సభ్యులు జుజాటి శ్రీవాణి, ఎడ్ల చిరంజీవి, ఎరుబాటి నాగరాజు, రౌతు రాజేష్, కోడం సంజీవ్, బైరి రవీందర్, ఏనుగు శోభారాణి , గ్రామ పెద్దలకు ఆదిత్య, అమృత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ .దేవేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉపయోగపడే మెరుగైన వైద్య సౌకర్యం అందించడమే మా లక్ష్యమని ఇలాంటి ఉచిత వైద్య సేవా కార్యక్రమాలను రాబోయే రోజుల్లో మరిన్ని గ్రామాలకు విస్తరింపజేస్తామని ఆదిత్య అమృత హాస్పిటల్ మేజింగ్ డైరెక్టర్ తెలిపారు.



## పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ ప్రవేశాలు

జ్యోతినగర్, ఎన్టీపీసీ పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : గోదావరిఖనిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. యాట ప్రసాద్ తెలిపారు సెప్టెంబర్ 3వ తేదీ వరకు కళాశాల కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఐసెట్--2026 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారితో పాటు అర్హత సాధించని విద్యార్థులు, ప్రవేశ పరీక్షకు హాజరుకాని అభ్యర్థులు కూడా స్పాట్ ప్రవేశాల్లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు వాటి జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9849300661, 9618180415, 7097096996 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## డోంగ్లీ గ్రామంలో 20 లక్షల నిధులతో సీసీ రోడ్డు కొరకు పూజలు నిర్వహణ



మద్నూర్ / సెప్టెంబర్ 02 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

డోంగ్లీ మండల కేంద్రంలోని సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కాంతారావు స్థానిక నాయకుల సమక్షంలో పూజలు నిర్వహించడం జరిగింది. బుధవారం రోజున డోంగ్లీ గ్రామంలో 20 లక్షల నిధుల ద్వారా చేపట్టుతున్నటువంటి సీసీ రోడ్డు కొరకు ఎమ్మెల్యే కాంతారావు కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించడం జరిగింది. గ్రామానికి సీసీ రోడ్డు కొరకు 20 లక్షలు నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు, ప్రజలు ఎమ్మెల్యే కాంతారావు కు ప్రత్యక ధన్యవాదములు తెలిపారు. వర్షాకాలం లో గ్రామస్థులకు ఇబ్బందులు కలుగుతుండటం తో ఎమ్మెల్యే వారి యొక్క విన్నపన్ని పరిధిలో తీస్కొని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నూతన సీసీ రోడ్డు నిర్మాణం కొరకు మంజూరు చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. సీసీ రోడ్డు పనులు మంచిగా చేసి ప్రజలకు నడవటానికి మంచి సౌకర్యంగా ఏర్పడాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే కాంతారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజనాన్ దేశాయి, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బాచ వార్ లక్ష్మణ్ పటేల్, మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, సర్పంచ్ కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీటీసీ దిన్ దయాల్ ( బాలాజీ పటేల్ ), చాంద్ పటేల్, విలాస్ గైక్వాడ్, బస్వంత్ పటేల్ , చౌలవార్ హన్మాండ్లు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, డోంగ్లీ గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రావణ కన్నెత్తి చూడని సంబంధిత అధికారులు



మద్నూర్ / సెప్టెంబర్ 02( అక్షరం న్యూస్ -కామారెడ్డి )

రాష్ట్ర సరిహద్దు ప్రాంతం లో ఇసుక కాసులు యాదచ్ఛంగా అక్రమ రవాణా ఇసుక తీసుకోవెళ్తున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం జరుగుతుందని ఉమ్మడి మండలాల ప్రజలు చర్చించుకోవడం విశేషం. మంజీరా నది నుండి ప్రతి రోజు రాత్రి సమయాలలో పదుల సంఖ్యలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న పట్టించుకునే వారు లేక ఇసుక కాసురులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం కొనసాగించడం జరుగుతుంది. ప్రతి రోజు రాత్రి సమయాలలో ఇసుక కాసుల దారులు మంజీరా నది నుండి మద్నూర్, పెద్ద తడుగుర్, ఇటు మీర్జాపూర్, భక్తపూర్ గుండా ట్రాక్టర్లలో అక్రమ రవాణా చేస్తున్నారని తెలిపారు. సంబంధిత శాఖ వారు చూసి చూడనట్టుగా వ్యవహరించడం మూలంగా రాత్రి పూట ఇసుక అక్రమ రవాణా సులభంగా జరుగుతుందని ప్రచారం జోరుగా నడుస్తుంది. ఆయా శాఖల వారి యొక్క నిఘా నేత్రం లేకపోవడం వలన ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్నటువంటి మూత బడిన పెట్రోల్ పంపులలో రాత్రి పూట డంపులు చేసి మరుసటి రోజు సాయంత్రం చీకటి పడ్డాక ట్రాక్టర్లలో ఇసుక నింపి మహారాష్ట్ర కు తరలించడం జరుగుతుంది. మహారాష్ట్ర, కర్ణాటక లో ఇసుక కు మంచి డిమాండ్ ఉండటం తో ఇక్కడ నుండి రాత్రి కి రాత్రి మంజీరా నది నుండి ఇసుక రవాణా చేస్తున్న దృశ్యాలు అధికంగా ఏర్పడుతున్నాయి. సిర్పూర్ గ్రామ వైపు నుండి ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేసి అధిక డబ్బులకు అమ్ముకొని మంచి సంపాదన సంపాదించడం జరుగుతుంది. ఇకనైనా మంజీరా నది నుండి అక్రమ ఇసుక రవాణా జరగకుండా పోలీస్, రెవిన్యూ శాఖ వారు దృష్టి పెట్టి అక్రమ రావణకు అడ్డుకట్ట వేయాలని ఉమ్మడి మండలాల ప్రజలు కోర్తున్నారు.

## కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి.
- హామీల అమలు వైఫల్యంపై ?420 అడుగుల భారీ ఫ్లెక్సీతో బీఆర్ఎస్ ఆందోళన.



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 02 / అక్షరం న్యూస్ -:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు.ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో దాసరి ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ నుంచి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు పార్టీ శ్రేణులతో కలిసి భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు.ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ ఎండగట్టేలా 420 అడుగుల పొడవైన భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ ఆందోళనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దాసరి మనోహర్‌రెడ్డి పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను,ఆరు గ్యారంటీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల వెలుగులోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రజలను మరింత చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత గులాబీ శ్రేణులపై ఉందన్నారు. ప్రభుత్వం ఇంకా అమలు చేయాల్సిన పథకాలు,ప్రజలకు చెల్లించాల్సిన బాకీల వివరాలన్నీ స్పష్టంగా ఉండేలా రూపొందించిన బాకీ కార్డులను ప్రతి ఇంటా పంపిణీ చేయాలని ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. మండల కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రం వరకు పార్టీ కార్యక్రమాలన్నింటినీ ఎంతో సమన్వయంతో, పకడ్బందీగా నిర్వహించాలని కోరారు.ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ వెనకడుగు వేయదని, నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు సాగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిలదీసే బలమైన ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషిస్తామని ఆయన తేల్చిచెప్పారు.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, మాజీ ఎంపీపీ నూనెటి సంపత్,మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతితో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వైయస్సార్ ఆశయ సాధనే మన ముందున్న లక్ష్యం కాంగ్రెస్ నాయకులు





- ములకలపల్లి మండలంలో ఘనంగా వైయస్సార్ 17వ వర్ధంతి.
- రామచంద్రాపురంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /సెప్టెంబర్ 2 /అక్షరం న్యూస్ -:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం రామచంద్రాపురంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వైయస్సార్ విగ్రహానికి భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి, ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి జహీరుద్దీన్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ... తెలుగు ప్రజల గుండెల్లో వైయస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, పేదల సంక్షేమ పథకాల ద్వారా కోట్ల మంది జీవితాల్లో వైయస్సార్ చెరగని ముద్ర వేశారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయడమే వైయస్సార్ ఆశయం అని స్పష్టం చేస్తూ, ఆయన ఆశయ సాధనే ధ్యేయంగా ప్రతి కార్యకర్త వైయస్సార్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు పెటెటి నరసింహారావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాలకుర్తి రత్నభూషణం, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు అచెన వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సున్నం సుధాకర్, సేవాదళ్ మండల అధ్యక్షుడు గాడి తిరుపతిరెడ్డి, ఎస్ఐఆర్ మండల కోఆర్డినేటర్ సురభి రాజేష్, మాజీ సర్పంచులు కారం సుధీర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రామ్మోహన్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైయస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## వైయస్ రాజశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ నేతల ఘన నివాళులు



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 02 / అక్షరం న్యూస్ -:

పెద్దపల్లి పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద, పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు, పట్టణ అధ్యక్షులు. భూతగడ్డ సంపత్ ఆధ్వర్యంలో, స్వర్గీయ ముఖ్యమంత్రి వర్యులు, వైయస్ రాజశేఖర్ రెడ్డి, 17వ వర్ధంతి, కాంగ్రెస్ పార్టీ ఘన నివాళులర్పించడం జరిగినది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి, పేద ప్రజల సంక్షేమం కోసం, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన, గొప్ప మహానీయుడు, రైతులకు ఉచిత కరెంటు, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇండ్లు, 108, విద్యా వైద్యం ఉపాధి లాంటి అనేక సంక్షేమ పథకాలు, ప్రవేశపెట్టి, పింఛన్లు, క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు, అందే విధంగా కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు ఈ కార్యక్రమంలో, బీసీ సెల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బొడ్డుపల్లి శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి, సయ్యద్ మస్రత్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, అక్బర్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాంసాని శ్రీనివాస్, మంతన్ నర్సింగ్, దొడ్డుపల్లి జగదీష్, టి సుభాష్ రావు, సంసిర్ బేగ్, ఇమ్రాన్, తాడూరు శ్రీమాన్, కమల్, పురిల్ల సుధాకర్, తిర్రి రాజేందర్, సల్మాన్, నతట్ల కుమార్, గంగుల వెంకటేశం, కాజా బాషా, క్రాంతి, మార్వాటి రవి, నక్క సతీష్, ముక్కెర రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు తరాలకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య.



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 02 / అక్షరం న్యూస్ -:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా తలపెట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దపల్లి పట్టణంలోని 21వ వార్డ్ శాంతి నగర్ లో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య వార్డ్ ప్రజలకు మొక్కలను అందజేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు తమ తమ ఇండ్లలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని రానున్న భావితరాల వారికి బంగారు భవిష్యత్తు ఇవ్వాలని అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజ్జన్న మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు కావున ప్రతి ఒక్క కౌన్సిలర్లు మీ యొక్క వార్డులలో చెట్లని ప్రతి ఒక్క ఇంటికి అందించి వాటిని సంరక్షించేలా చూడాలని అన్నారు ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ కుమార్, నర్సరీ ఇంచార్జ్ సదానందం, మెప్మా ఆర్పీ అజిత, నర్సరీ సిబ్బంది మరియు వార్డ్ మహిళలు పాల్గొన్నారు.

## లో-వోల్టేజ్‌తో ఆగమవుతున్న రైతులు

- పంటలు ఎండకముందే కరెంట్ ఇవ్వండి
- బొంపెల్లి సబ్ స్టేషన్‌లో ఏఈకి రాగినీడు రైతుల వినతి.
- సమస్య పరిష్కరించకపోతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం.
- రాగినేడు గ్రామ సర్పంచ్ సోమ కుమార్.



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి రూరల్ / సెప్టెంబర్ 02 / అక్షరం న్యూస్ -:

రెక్కల కష్టాన్ని నమ్ముకుని, అప్పుసప్పులు చేసి పంటలు సాగు చేస్తే.. లో-వోల్టేజ్ సమస్య మా ప్రాణాల మీదికి తెస్తోంది. సరైన సమయానికి నీరందకపోతే పచ్చని పంటలు కళ్లముందే ఎండిపోయే ప్రమాదం ఉందంటూ పెద్దపల్లి మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర హెచ్చుతగ్గులు, లో-వోల్టేజ్ సమస్య తలెత్తడంతో వ్యవసాయ బోర్ మోటార్లు పనిచేయడం లేదు. స్టార్టర్లు మాటిమాటికీ ట్రిప్ అవ్వడం, పంటలు ఎదుగుదలకు వచ్చి నీరు అత్యంత కీలకమైన ఈ సమయంలో కరెంట్ సక్రమంగా రాకపోవడంతో రైతాంగంలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ తీవ్ర సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం గ్రామ సర్పంచ్ సోమ కుమార్ ఆధ్వర్యంలో రైతులు పెద్ద సంఖ్యలో బొంపెల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌కు తరలివచ్చి అసిస్టెంట్ ఇంజనీర్ ఏఈ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాగినేడు సర్పంచ్ సోమ కుమార్ మాట్లాడుతూ. పరిస్థితి చేయిదాటి పంట పొలాలు ఎండిపోయేంత వరకు అధికారులు తాత్సారం చేయకుండా వెంటనే క్షేత్రస్థాయికి వచ్చి లైన్లను పరిశీలించాలని డిమాండ్ చేశారు. లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తక్షణమే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను డిటిఆర్ ఏర్పాటు చేసి, నాణ్యమైన పూర్తిస్థాయి విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరారు. ఒకవేళ విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించకపోతే, గ్రామ రైతులందరినీ కలుపుకుని పెద్దపల్లి ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు, పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు

## సీనియర్ పాత్రికేయులు అయిత శేషగిరిరావును పరామర్శించిన జనసేన నాయకులు -డాక్టర్ గడల శ్రీనివాసరావు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /సెప్టెంబర్ 2 /అక్షరం న్యూస్-:

ములకలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు అయిత శేషగిరిరావును జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం ఆయన నివాసంలో పరామర్శించారు.కొన్ని రోజుల క్రితం హెర్నియా శస్త్రచికిత్స చేయించుకున్న శేషగిరిరావు ప్రస్తుతం ములకలపల్లిలోని తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు రాము, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ ప్రవీణ్, జిల్లా నాయకులు గరిక రాంబాబు, స్థానిక ఉపసర్పంచ్ పువ్వాల లలితారావు, మున్నూరు కాపు సంఘం మండల నాయకులు పువ్వాల మంగపతి, బేతాళ వెంకన్న బాబు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ నోటీసులపై బి ఎల్ ఏ లు అవగాహన కల్పించాలి


- ఓటర్లందరూ తమ వివరాలను పరిశీలించుకోవాలి.
- ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జహీరుద్దీన్ కోఆర్డినేటర్ సురభి రాజేష్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /సెప్టెంబర్ 2/ అక్షరం న్యూస్–: ములకలపల్లి మండల కేంద్రంలో నోటీసులు అందుకున్న ఓటర్లకు అవగాహన కలిపిస్తున్న ము లకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జహీరుద్దీన్ ములకలపల్లి కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ కోఆర్డినేటర్ సురభి రాజేష్ వారు మాట్లాడుతూ యస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు అందుతున్న నోటీసులపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని ములకలపల్లి మండల కాంగ్రెస్ బి యల్ ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్ సూచించారు. ఓటర్లకు అందిన ఎస్ ఐ ఆర్ నోటీసులో తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, వయస్సు, చిరునామా తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని ఆయన కోరారు. వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సంబంధిత బి యల్ ఏ లు, బి యల్ ఓ లను సంప్రదించి అవసరమైన పత్రాలతో సరిచేయించుకోవాలని తెలిపారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం, ఓటర్ల వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయడం వంటి అంశాల్లో యస్ ఐ అర్ ప్రక్రియ కీలకమని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా, తమకు అందిన నోటీసులను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులను లేదా బీ యల్ ఏ లను సంప్రదించాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడికి ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని సురభి రాజేష్ అన్నారు. అందువల్ల ఓటర్లందరూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన సవరణలు ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు. మీ ఓటు మీ హక్కు మీ పేరు మీ వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా ఉన్నాయో లేదో తప్పక పరిశీలించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ ల సూపర్వైజర్ మాజీ పిఎసిఎస్ చైర్మన్ కరటూరు కృష్ణ రత్నాకర్ రెడ్డి మండలవాసులు ఉన్నారు.

## బరువు తగ్గడంతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంచే హై-ఇంటెన్సిటీ వ్యాయామాలు.. ఈ సూచనలు పాటించండి..



బరువు నియంత్రణతో పాటు శారీరక దృఢత్వాన్ని ెపంచ్ుకో్వాలని కోరుకునేవారిలో ప్రస్తుతం హై–ఇంటెన్సిటీ వర్కౌట్స్‌కు ఆదరణ పెరుగుతోంది. వీటిలో క్రాస్‌ఫిట్ కూడా ఒకటి. తక్కువ సమయంలో ఎక్కువ శారీరక శ్రమను అందించే ఈ వ్యాయామ విధానంలో బలాన్ని పెంచే వ్యాయామాలతోపాటు కార్డియో, జిమ్నాస్టిక్స్, రోజువారీ కదలికలకు ఉపయోగపడే ఫంక్షనల్ మూవ్‌మెంట్స్‌ను కలిపి చేస్తారు. సరైన పద్ధతిలో, వ్యక్తి సామర్థ్యానికి అనుగుణంగా వ్యాయామాలను మార్చుకుంటూ చేస్తే బలం, కార్డియోవాస్క్యులర్ ఫిట్‌నెస్ రెండింటినీ మెరుగుపరచడంలో క్రాస్‌ఫిట్ సహాయపడుతుంది. క్రాస్‌ఫిట్‌లో వివిధ రకాల ఫంక్షనల్ మూవ్‌మెంట్స్‌ను భిన్నమైన తీవ్రతలతో చేస్తారు. సాధారణంగా ఒక సెషన్‌లో ముందుగా వార్మప్, ఆ తర్వాత టెక్నిక్ లేదా స్ట్రెంగ్త్ ట్రైనింగ్, అనంతరం పలు వ్యాయామాలను కలిపిన వర్కౌట్ ఉంటుంది. ఇందులో స్క్వాట్స్, డెడ్‌లిఫ్ట్స్, పుష్–అప్స్, పుల్–అప్స్, బర్పీస్, కెటిల్‌బెల్ స్వింగ్స్, రోయింగ్, రన్నింగ్, బాక్స్ జంప్స్, ఒలింపిక్ లిఫ్ట్స్ వంటి వ్యాయామాలు కూడా ఉంటాయి.

### ఫిట్‌నెస్ స్థాయికి అనుగుణంగా..

క్రాస్‌ఫిట్ వర్కౌట్స్‌ను వ్యక్తి ఫిట్‌నెస్ స్థాయికి అనుగుణంగా మార్చుకోవచ్చు. అంటే మొదటిసారి క్రాస్‌ఫిట్ ప్రారంభించే వ్యక్తి అనుభవజ్ఞుడైన అథ్లెట్ చేసేంత బరువుతో లేదా అదే స్థాయిలో వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదు. బరువు, వ్యాయామం కష్టం, పునరావృతాల సంఖ్య వంటి అంశాలను వ్యక్తి సామర్థ్యానికి అనుగుణంగా సర్దుబాటు చేసుకునే వీలు ఉంది. క్రాస్‌ఫిట్‌లో స్క్వాట్స్, డెడ్‌లిఫ్ట్స్, ప్రెస్‌లు, ఒలింపిక్ లిఫ్ట్స్ వంటి రెసిస్టెన్స్ వ్యాయామాలకు ముఖ్యమైన స్థానం ఉంటుంది. ఇవి కండరాలు ప్రతిఘటనకు వ్యతిరేకంగా బలాన్ని ఉపయోగించేలా చేస్తాయి. క్రమంగా శిక్షణను పెంచుకుంటూ వెళ్లడం వల్ల కండరాల బలం, శక్తి మెరుగుపడుతుంది. ముఖ్యంగా ఒకేసారి అనేక కండరాలు, కీళ్లను ఉపయోగించే కాంపౌండ్ వ్యాయామాలు శారీరక బలాన్ని పెంచడంలో ఉపయోగపడతాయి. అయితే గరిష్ఠ స్థాయిలో బలం పెంచుకోవడం ప్రధాన లక్ష్యంగా ఉన్నవారికి భారీ బరువులతో ప్రత్యేకంగా రూపొందించిన స్ట్రెంగ్త్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ మరింత అనుకూలంగా ఉంటుంది.

### గుండె ఆరోగ్యానికి..

క్రాస్‌ఫిట్ కార్డియోవాస్క్యులర్ ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. ఇందులో తక్కువ విశ్రాంతి వ్యవధులతో వరుసగా అధిక తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. రన్నింగ్, రోయింగ్, సైక్లింగ్, జంపింగ్, బాడీవెయిట్ మూవ్‌మెంట్స్ వంటి వ్యాయామాల వల్ల గుండె వేగం పెరుగుతుంది. క్రమం తప్పకుండా ఏరోబిక్, హై–ఇంటెన్సిటీ వ్యాయామాలు చేయడం వల్ల కార్డియోవాస్క్యులర్ ఫిట్‌నెస్, వ్యాయామ సామర్థ్యం మెరుగుపడుతుంది. అయితే అధిక తీవ్రత కలిగిన వ్యాయామమే అన్ని రకాల ఏరోబిక్ కార్యకలాపాలకు ప్రత్యామ్నాయం కాదు. వేగంగా నడవడం, సైక్లింగ్ లేదా స్థిరమైన వేగంతో పరుగెత్తడం వంటి మితమైన తీవ్రత కలిగిన వ్యాయామాలు కూడా గుండె ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటాయి. క్రాస్‌ఫిట్ వర్కౌట్ ఎక్కువగా కష్టంగా అనిపించడానికి ప్రధాన కారణం ఒకదాని తర్వాత మరొక వ్యాయామాన్ని తక్కువ విశ్రాంతి సమయంలో చేయడమే.

# బీఆర్ఎస్‌లో బలప్రదర్శన.. అశ్వారావుపేటలో హాట్ టాపిక్!






- కాంగ్రెస్‌పై నిరసనకు కదిలిన గులాబీ దళం.. తెరపైకి వర్గపోరు
- మెచ్చా వర్గం ఓ వైపు.. తాటి వర్గం మరోవైపు.. ఒకే అంశంపై వేర్వేరు ర్యాలీలతో ఆసక్తికర పరిణామాలు

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / సెప్టెంబర్ 2 / అక్షరం న్యూస్:కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల హామీలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాలు అశ్వారావుపేటలో రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు చేపట్టిన ఆందోళనలు కాస్తా సొంత పార్టీలోని బలాబలాలను చాటుకునే వేదికలుగా మారాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.ఒకవైపు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించగా.. మరోవైపు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కాసాని నాగశేష పద్మ--చంద్రమోహన్, కౌన్సిలర్ డా. ఉదయజ్యోతి--ప్రసాద్ ఆధ్వర్యంలో మరో నిరసన ర్యాలీ నిర్వహించడం చర్చనీయాంశమైంది.

### 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో మెచ్చా వర్గం నిరసన

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ నుంచి రింగ్ రోడ్ వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇన్‌చార్జ్ ఉప్పల వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎత్తిచూపుతూ 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రదర్శించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద సంఖ్యలో గులాబీ శ్రేణులు పాల్గొనడంతో అశ్వారావుపేట పట్టణం గులాబీమయంగా మారింది.

### వంద రోజుల హామీలు.. వెయ్యి రోజులైనా నెరవేరలే: మెచ్చా

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా హామీల అమలులో విఫలమైందని విమర్శించారు.మహిళలకు రూ.2,500, పెన్షన్ రూ.4 వేలు, రైతులకు ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం, యువతకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, తిరిగి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### ఆ గ్యారెంటీ కార్డులు ఎక్కడ పెట్టుకోవాలి?: ఉప్పల

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు గ్యారెంటీ కార్డులను భద్రంగా దాచుకోవాలని చెప్పారని, ఇప్పుడు హామీలు అమలు కానప్పుడు ఆ కార్డులను ఎక్కడ పెట్టుకోవాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.మహిళలకు ఉచిత స్కూటీలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలన ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు.

### తాటి వర్గం ఆధ్వర్యంలోనూ భారీ ర్యాలీ

ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కాసాని నాగశేష పద్మ--చంద్రమోహన్, కౌన్సిలర్ డా. ఉదయజ్యోతి--ప్రసాద్ ఆధ్వర్యంలో మరో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కాసాని పద్మ--చంద్రమోహన్ స్వగృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా రింగ్ సెంటర్ వరకు సాగింది.ర్యాలీ సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 'కాంగ్రెస్ పార్టీ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట' అంటూ నినాదాలు చేస్తూ గులాబీ జెండాలతో కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు.

### హామీలు అమలు చేసే వరకు పోరాటం: తాటి

మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతు భరోసా, రుణమాఫీ, రైతులకు పెట్టుబడి సాయం, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి వంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.బీఆర్ఎస్ నాయకులు కాసాని పద్మ--చంద్రమోహన్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నికల హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ డా. ఉదయజ్యోతి--ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో ప్రజలకు నిరాశే మిగిలిందని విమర్శించారు.

### కాంగ్రెస్‌పై పోరాటమా.. సొంత పార్టీలో బలప్రదర్శనా?

ఒకే పార్టీకి చెందిన నేతలు.. ఒకే అంశంపై వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడంతో అశ్వారావుపేట బీఆర్ఎస్‌లోని అంతర్గత రాజకీయాలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఒకవైపు మెచ్చా నాగేశ్వరరావు వర్గం.. మరోవైపు తాటి వెంకటేశ్వర్లు వర్గం అంటూ స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు నిర్వహించిన నిరసనలు సొంత పార్టీలో ఎవరి వెంట ఎంత బలం ఉందనే చర్చకు దారితీశాయని స్థానికంగా మాట్లాడుకుంటున్నారు. కాంగ్రెస్‌ను ప్రశ్నించడానికా.. లేక బీఆర్ఎస్‌లో తమ బలాన్ని నిరూపించుకోవడానికా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసనలు అశ్వారావుపేటలో కాంగ్రెస్‌పై పోరాటంతో పాటు బీఆర్ఎస్ అంతర్గత బలాబలాల చర్చకు



# శిరీష కుటుంబాన్ని పరామర్శించిన జనసేన నేత గడల శ్రీనివాసరావు





- జ్యుడీషియల్ విచారణ జరిపించాలి..
- బాధిత కుటుంబానికి ఉద్యోగం కల్పించాలి.
- జనసేన పార్టీ తరఫున రూ.30 వేల ఆర్థిక సాయం అందజేత.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /సెప్టెంబర్ 2 /అక్షరం న్యూస్–:

హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష కుటుంబాన్ని జనసేన పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ గడల శ్రీనివాసరావు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి, వారికి పార్టీ తరఫున ధైర్యం చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. శిరీష మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలుగులోకి తెవాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలి అని బాధ్యత గల ఆసుపత్రి లైసెన్స్‌ను తక్షణమే రద్దు చేయాలి అని బాధిత కుటుంబంలో ఒకరికి క్లాస్–4 ఉద్యోగం కల్పించి ప్రభుత్వం ఆదుఅనంతరం శిరీష కుటుంబానికి జనసేన పార్టీ తరఫున రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ మిరియాల రామకృష్ణ, రాము యాదవ్, గరికె రాంబాబు, తాటికొండ ప్రవీణ్, పొడిచేటి చెన్నారావు, నక్కన రమేష్, ఉకే నాగరాజు, కొండ్రు నాగేంద్రబాబు, కొండ్రు కృష్ణ, ప్రకాష్, సూరిబాబు, వీర మహిళలు కావ్య రాజకుమారి, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రెక్కింగ్‌కు వెళ్లేవారు ముందుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.. ఎందుకంటే..?

ఎతీవఎనెఅఅస్త్ర । పర్వత ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లడం ఉత్సాహాన్ని కలిగించే అనుభవమే. అయితే ఎత్తైన ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేయడానికి శారీరకంగా ఫిట్‌గా ఉండటం ఒక్కటే సరిపోదు. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం, బరువులు ఎత్తడం, మంచి స్టామినా ఉండటం వల్ల శరీరం తక్కువ ఆక్సిజన్ ఉన్న ఎత్తైన ప్రాంతాలకు సులభంగా అలవాటు పడుతుందని చెప్పలేం. అందుకే హై ఆల్టిట్యూడ్ ట్రెక్కింగ్‌కు వెళ్లే ముందు ఆరోగ్య పరిస్థితిని ఒకసారి అంచనా వేయడం ముఖ్యం. ఎత్తు పెరిగే కొద్దీ వాతావరణ పీడనం తగ్గుతుంది. దీంతో ప్రతి శ్వాసలో శరీరానికి అందే ఆక్సిజన్ పరిమాణం తగ్గుతుంది. ఫలితంగా ఊపిరితిత్తులు, గుండెతోపాటు ఇతర అవయవాలపై అదనపు ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా ఎత్తుకు శరీరం సరిగ్గా అలవాటు పడకముందే వేగంగా పైకి ఎక్కితే ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.



## నిద్రలేమి సమస్యకు మెగ్నీషియం లేదా మెలటోనిన్.. ఏది చక్కగా పనిచేస్తుంది..




నిద్ర సరిగా లేకపోవడం రోజువారీ జీవనశైలిపై మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. నిద్రలేమి సమస్యలను ఎదుర్కొంటున్నవారు మెగ్నీషియం, మెలటోనిన్ వంటి సప్లిమెంట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ఈ రెండూ ఒకే విధంగా పనిచేయవు. నిద్ర సమస్యకు కారణం శరీరంలో ఉన్న లోపాలు, నిద్ర సమయం వంటి అంశాలను బట్టి వీటి ప్రయోజనం మారుతుంది. శరీరానికి అవసరమైన ముఖ్యమైన ఖనిజాల్లో మెగ్నీషియం ఒకటి. ఇది 300కు పైగా జీవరసాయన ప్రక్రియల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా నాడీ వ్యవస్థ పనితీరును ప్రభావితం చేయడంతోపాటు, నిద్ర, విశ్రాంతికి సహాయపడే గాబా (+ూదీూ) అనే న్యూరోట్రాన్స్‌మిటర్ నియంత్రణలోనూ భాగస్వామ్యం వహిస్తుంది.

### మెగ్నీషియం తగ్గితే..

శరీరంలో మెగ్నీషియం స్థాయిలు తక్కువగా ఉన్నవారికి దీని సప్లిమెంటేషన్ కొంత ప్రయోజనం కలిగిస్తుంది. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ నిద్ర సమస్యలు ఎదుర్కొనే వృద్ధులు, ఒత్తిడి కారణంగా నిద్ర సరిగా పట్టని వారు మెగ్నీషియం ద్వారా ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. ఇది కండరాల ఒత్తిడిని, శరీరంలోని టెన్షన్‌ను తగ్గించి విశ్రాంతికి సహాయపడుతుంది. మరోవైపు, మెలటోనిన్ అనేది మెదడు సహజంగా ఉత్పత్తి చేసే హార్మోన్. సాధారణంగా నిద్రపోయే సమయం దగ్గరపడినప్పుడు దీని ఉత్పత్తి పెరుగుతుంది. శరీరంలోని అంతర్గత జీవ గడియారాన్ని నియంత్రించడంలో మెలటోనిన్ కీలక పాత్ర పోషిస్తుంది. శరీరానికి నిద్ర సమయం వచ్చిందనే సంకేతాన్ని అందించడం ద్వారా నిద్రలోకి వెళ్లేందుకు సహాయపడుతుంది. జెట్ లాగ్ కారణంగా నిద్ర సమయం మారిపోయినవారికి మెలటోనిన్ ఉపయోగపడే అవకాశం ఉంటుంది. అలాగే షిఫ్ట్ ఉద్యోగులు, నిద్ర సమయం ఆలస్యంగా మారిపోయినవారు, శరీరంలోని సహజ నిద్ర-మెళకువ చక్రంలో మార్పులు వచ్చినవారికి కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుంది.

### పనితీరు భిన్నం..

మెగ్నీషియం, మెలటోనిన్ రెండూ నిద్రకు సహాయపడినా వాటి పనితీరు భిన్నంగా ఉంటుంది. మెగ్నీషియం ప్రధానంగా శరీరం, కండరాలు విశ్రాంతి పొందేందుకు, నాడీ వ్యవస్థలోని కొన్ని ప్రక్రియలను నియంత్రించేందుకు సహాయపడుతుంది. మెలటోనిన్ మాత్రం శరీరానికి నిద్రపోయే సమయం వచ్చిందనే సంకేతాన్ని అందించడం ద్వారా నిద్ర చక్రాన్ని సరిచేయడంలో సహాయపడుతుంది. నిద్రపట్టకపోవడానికి ప్రధాన కారణం శరీరం లేదా మనసు రిలాక్స్ కాకపోవడం అయితే మెగ్నీషియం కొంత ఉపయోగపడుతుంది. నిద్ర సమయం పూర్తిగా మారిపోవడం, రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం వంటి సమస్యలు ఉంటే మెలటోనిన్ మరింత అనుకూలంగా ఉండే అవకాశం ఉంటుంది. మెలటోనిన్ సాధారణంగా మెగ్నీషియంతో పోలిస్తే వేగంగా ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో మెగ్నీషియం, మెలటోనిన్ రెండింటినీ కలిపి తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, వైద్య నిపుణుల సలహా తీసుకోవడం అవసరం. సొంతంగా అధిక మోతాదులో తీసుకోవడం వల్ల అవాంఛిత దుష్ప్రభావాలు కలిగిస్తుంది. మెగ్నీషియంను అధిక మోతాదులో తీసుకుంటే విరేచనాలు, కడుపులో అసౌకర్యం వంటి సమస్యలు వస్తాయి. కొన్ని మందులతో ఇది పరస్పర చర్యలకు కూడా కారణం అవుతుంది. మెలటోనిన్‌ను అధికంగా లేదా వైద్యుల సూచన లేకుండా తీసుకుంటే పగటిపూట మగత, తల తిరగడం, తలనొప్పి, ఎక్కువగా లేదా స్పష్టంగా కలలు రావడం వంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయి.

### వైద్యుల సలహా తప్పనిసరి..

గర్భిణులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, ప్రిస్క్రిప్షన్ మందులు వాడుతున్నవారు, పిల్లలు వైద్యుల సలహా లేకుండా మెగ్నీషియం లేదా మెలటోనిన్ సప్లిమెంట్లు తీసుకోకపోవడం మంచిది. శరీరంలో ఏదైనా పోషక లోపం ఉందా లేదా తెలుసుకోవడానికి అవసరమైతే రక్త పరీక్షలు చేయించుకోవడం కూడా మంచిది. అయితే మంచి నిద్ర కోసం సప్లిమెంట్లపైనే ఆధారపడాల్సిన అవసరం లేదు. ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవడం, నిద్రకు ముందు స్క్రీన్ వినియోగాన్ని తగ్గించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, కెఫీన్ తీసుకునే పరిమాణాన్ని నియంత్రించడం వంటి జీవనశైలి మార్పులు నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఒత్తిడిని తగ్గించుకునేందుకు రిలాక్సేషన్ టెక్నిక్స్‌ను పాటించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. మెగ్నీషియం, మెలటోనిన్ రెండూ నిద్రకు కొన్ని సందర్భాల్లో సహాయపడే సప్లిమెంట్లే అయినప్పటికీ, ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా పనిచేస్తాయని చెప్పలేమని వారు తెలియజేస్తున్నారు. నిద్ర సమస్యకు అసలు కారణాన్ని గుర్తించి, అవసరమైనప్పుడు నిపుణుల సలహాతో వీటిని ఉపయోగించడం సురక్షితమైన మార్గం. ముఖ్యంగా సరైన నిద్ర సమయాన్ని పాటించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించడం నిద్ర నాణ్యతను మెరుగుపరచడానికి మొదటి అడుగుగా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి






- వ్యవసాయ కళాశాలలో అవగాహన సదస్సు
- డిజిటల్ అరెస్ట్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, పెట్టుబడి మోసాలపై జాగ్రత్త: డీఎస్పీ సతీష్ కుమార్

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / సెప్టెంబర్ 2 / అక్షరం న్యూస్:అశ్వారావుపేట మండలంలోని వ్యవసాయ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త విధానంలో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ముఖ్యంగా ఈ మోసాలపై జాగ్రత్త

**1. డిజిటల్ అరెస్ట్ మోసాలు:**

పోలీసులు, సీబీఐ, ఈడీ అధికారులమంటూ వీడియో కాల్ చేసి భయపెట్టి డబ్బులు వసూలు చేయడం పూర్తిగా మోసమని తెలిపారు. పోలీసులు ఎప్పుడూ వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరని స్పష్టం చేశారు.

**2. ఇంటి నుంచే ఉద్యోగాల పేరుతో మోసాలు:**

టెలిగ్రామ్, వాట్సాప్‌ల ద్వారా ఇంటి నుంచే ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించవచ్చంటూ సందేశాలు పంపుతున్నారని తెలిపారు. మొదట కొంత డబ్బు ఇచ్చి నమ్మించి, అనంతరం పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని హెచ్చరించారు.

**3. పెట్టుబడుల పేరుతో మోసాలు:**

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పే నకిలీ వ్యాపార యాప్‌ల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అధిక లాభాల ఆశ చూపితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ఇవి తప్పక గుర్తుంచుకోవాలి

- అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే అనుమానాస్పద లింకులను తెరవకూడదు.
- ఒకసారి వినియోగించే రహస్య సంఖ్యను ఎవరికీ చెప్పకూడదు.
- బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ వివరాలు ఇతరులకు ఇవ్వకూడదు.
- ఆన్‌లైన్ రుణ యాప్‌లు, వస్తువుల కొనుగోలు--అమ్మకాల పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.
- సామాజిక మాధ్యమాల్లో బెదిరింపులు, వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.
- సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కు ఫోన్ చేయాలి.
- cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. జె. హేమంత్ కుమార్, అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు, ఎస్ఐ టి. యయాతి రాజు, దేవ్ సింగ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు సైబర్ భద్రతపై పలు సూచనలు చేశారు. సుమారు 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## 99 శాతం మంది పీలుస్తున్నది

# కాలుష్యపు గాలినే.. అధ్యయనంలో వెల్లడి..

వాయు కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతోంది. ముఖ్యంగా గాలిలోని అత్యంత సూక్ష్మమైన కాలుష్య కణాలు శరీరంలోని వివిధ అవయవాలపై ప్రభావం చూపడంతో పాటు క్యాన్సర్ ముప్పును కూడా పెంచుతున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ జనాభాలో దాదాపు 99 శాతం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన గాలి నాణ్యత ప్రమాణాలను మించిన కాలుష్యానికి గురవుతున్నట్లు పరిశోధకులు తెలిపారు. 2000 నుంచి 2020 మధ్య కాలంలో ప్రపంచంలోని 952 ప్రాంతాల్లో నమోదైన క్యాన్సర్ భారాన్ని, సాధారణ వాయు కాలుష్య కారకాలకు దీర్ఘకాలికంగా గురికావడంతో ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేశారు. మొత్తం 10.9 కోట్ల క్యాన్సర్ కేసులను పరిశీలించిన ఈ పరిశోధనలో పీఎం2.5 ప్రధాన పాత్ర పోషిస్తున్న కాలుష్య కారకంగా గుర్తించారు. ఈ అధ్యయన ఫలితాలు నేచర్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



### పెరిగిన క్యాన్సర్ ముప్పు..

2.5 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం కలిగిన సూక్ష్మ కణాలను పీఎం2.5గా పిలుస్తారు. ఇవి చాలా చిన్నగా ఉండటంతో శ్వాస ద్వారా శరీరంలోకి సులభంగా ప్రవేశిస్తాయి. అధ్యయనం ప్రకారం 2000-2020 మధ్య నమోదైన మొత్తం క్యాన్సర్ కేసుల్లో సుమారు 88.2 లక్షల కేసులకు పీఎం2.5 కాలుష్యం కారణమై ఉంటుందని అంచనా వేశారు. ప్రతి క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం2.5 స్థాయి 10 మైక్రోగ్రాములు పెరిగినప్పుడు క్యాన్సర్ వచ్చే ప్రమాదం 17.9 శాతం పెరిగినట్లు అధ్యయనంలో గుర్తించారు. అదే స్థాయిలో పీఎం2.5కు గురికావడం వల్ల కిడ్నీ క్యాన్సర్ ప్రమాదం 17.9 శాతం, మూత్రాశయ క్యాన్సర్ ప్రమాదం 21.1 శాతం అధికంగా ఉన్నట్లు తేలింది. పీఎం2.5 ప్రభావం కేవలం శ్వాసకోశ వ్యవస్థకే పరిమితం కాదని పరిశోధకులు తెలిపారు. థైరాయిడ్, అన్నవాహిక, పెద్దపేగు, మలద్వారం, రొమ్ము వంటి ఇతర భాగాలకు సంబంధించిన క్యాన్సర్లతోనూ ఈ కాలుష్యానికి సంబంధం ఉన్నట్లు అధ్యయనం సూచించింది.


### నివారణే ముఖ్యం..

పీఎం2.5 కాలుష్యం తొలగించగలిగితే లేదా దానికి గురికావడాన్ని గణనీయంగా తగ్గించగలిగితే శ్వాసనాళం, బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసుల్లో సుమారు 17.9 శాతం వరకు నివారించవచ్చని అధ్యయనం అంచనా వేసింది. ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు పీఎం2.5 ఒక ప్రధాన కారణమనే విషయాన్ని ఈ ఫలితాలు మరింత బలపరుస్తున్నాయి. అదేవిధంగా, ఇతర వాయు కాలుష్య కారకాల ప్రభావాన్ని కూడా పరిశోధకులు పరిశీలించారు. ప్రతి క్యూబిక్ మీటర్‌కు 10 మైక్రోగ్రాముల చొప్పున పీఎం2.5, ఓజోన్, నైట్రోజన్ డయాక్సైడ్ స్థాయిలు పెరిగినప్పుడు క్యాన్సర్ ప్రమాదం వరుసగా 16 శాతం, 4.23 శాతం, 11.7 శాతం పెరిగినట్లు గుర్తించారు. 2000 నుంచి 2020 మధ్య నైట్రోజన్ డయాక్సైడ్ కాలుష్యానికి సంబంధించి సుమారు 66.7 లక్షల క్యాన్సర్ కేసులు నమోదైనట్లు అధ్యయనం అంచనా వేసింది. ఓజోన్ కాలుష్యానికి సంబంధించి సుమారు 26 లక్షల కేసులు ఉన్నట్లు వెల్లడించింది. ఎక్కువ రకాల క్యాన్సర్ల విషయంలో పురుషులతో పోలిస్తే మహిళలు ఈ కాలుష్య ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

### తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లోనే అధికం..

ప్రపంచవ్యాప్తంగా తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో వాయు కాలుష్యానికి గురికావడం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది. ప్రపంచ జనాభాలో దాదాపు 99 శాతం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన గాలి నాణ్యత మార్గదర్శకాలను మించిన కాలుష్య స్థాయిలను పీలుస్తున్నారని పరిశోధకులు తెలిపారు. పీఎం2.5 కణాలు చాలా చిన్న పరిమాణంలో ఉండటం వల్ల శరీరంలోకి లోతుగా ప్రవేశించి అనేక జీవక్రియలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధకులు వివరించారు. శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ పెరగడం, డీఎన్ఏ దెబ్బతినడం, రోగనిరోధక వ్యవస్థ పనితీరులో మార్పులు వంటి ప్రక్రియల ద్వారా ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని తెలిపారు. వాయు కాలుష్యం శరీరంలోని దాదాపు ప్రతి అవయవ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అధ్యయనం పేర్కొంది. వివిధ ఆదాయ స్థాయిలకు చెందిన దేశాలు, ప్రాంతాల నుంచి సేకరించిన క్యాన్సర్ డేటాను ఈ పరిశోధనలో ఉపయోగించడంతో ఫలితాలను ప్రపంచవ్యాప్తంగా వర్తింపజేయడానికి అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు.అ

# ప్రజా వ్యాయామం పర్యావరణానికి హితం చేసేదిగా ఉండాలి.. సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి..



నడక, సైక్లింగ్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ప్రోత్సహించే శారీరక వ్యాయామ కార్యక్రమాలు వాతావరణ మార్పులను తగ్గించడంలోనే కాదు, ప్రజల ఆరోగ్యాన్ని, సమానత్వాన్ని కూడా మెరుగుపరచగలవని తాజా అధ్యయనం తెలియజేస్తోంది. న్యూజిలాండ్‌లోని Auckland University of Technology పరిశోధకులు Physical Activity and Climate Change Model అనే ఒక కొత్త కాన్సెప్చువల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించారు. ఇది శారీరక వ్యాయామం, వాతావరణ మార్పు సమస్యలను కలిపి పరిష్కరించడానికి ఒక మార్గదర్శకంగా పనిచేస్తుందని పరిశోధకులు వెల్లడించారు. ఈ మోడల్ వివరాలను Nature Health అనే జర్నల్‌లో ప్రచురించారు. శారీరక వ్యాయామం, వాతావరణ మార్పు అంశాలను వేర్వేరుగా కాకుండా కలిసి పరిష్కరిస్తే, ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి మరింత లాభం కలుగుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం ప్రజలను శారీరకంగా చురుకుగా ఉండేలా చేసే ప్రయత్నాలు సరిపోవడం లేదు. ప్రజారోగ్యం, సమాజ లక్ష్యాలు సాధించాలంటే సమన్వయంతో కూడిన చర్యలు అవసరమని మొదటి పరిశోధన పత్రం ద్వారా పరిశోధకులు తెలిపారు.

### వాహనాల పై ఆధారపడడం తగ్గాలి..

ఈ మోడల్ ప్రకారం హీట్‌వేవ్స్, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు బయటకు వెళ్లి వ్యాయామం చేయడానికి అడ్డంకిగా మారుతున్నాయి. దీంతో ప్రజలు నడక, సైక్లింగ్ వంటి కార్యకలాపాలు చేయడం తగ్గుతోంది. పరిశోధకుల ప్రకారం నడక, సైక్లింగ్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగం వంటివి పెరిగితే వాహనాలపై ఆధారపడటం తగ్గుతుంది. దీంతో కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణానికి మేలు జరుగుతుంది. మరొక పరిశోధన పత్రం చీఫ్‌బతీవ వీవఎుఎఋఅవ జర్నల్‌లో ప్రచురించబడింది. ఇందులో 68 దేశాల డేటాను విశ్లేషించారు. అందులో కనిపించిన విషయం ఏమిటంటే, ధనిక దేశాల్లో ఉన్న సంపన్న పురుషులకు రిక్రియేషనల్ వ్యాయామం చేసే అవకాశాలు ఎక్కువ. పేద దేశాల్లో ఉన్న పేద మహిళలకు ఈ అవకాశాలు చాలా తక్కువ. ఇరువర్గాల మధ్య వ్యత్యాసం సుమారు 40 శాతం వరకు ఉంది. అయితే శారీరక శ్రమతో కూడిన పని మాత్రం పేద వర్గాల్లో ఎక్కువగా కనిపించింది.

### అమలు చాలా తక్కువే..

అలాగే మూడవ పరిశోధన పత్రం కూడా Nature Health లో ప్రచురించబడింది. ఇందులో 200 దేశాల్లో 2004 నుండి 2025 వరకు రూపొందించిన 661 జాతీయ విధానాలను పరిశీలించారు. అందులో ప్రధానంగా తేలింది ఏమిటంటే, చాలా దేశాలు శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించే విధానాలను రూపొందించాయి. కానీ వాటి అమలు చాలా తక్కువగా ఉంది. 661 విధానాల్లో కేవలం 38.7% (256 విధానాలు) మాత్రమే ఆరోగ్యం, విద్య వంటి మూడు లేదా అంతకంటే ఎక్కువ ప్రభుత్వ శాఖలను కలిపి అమలు చేయడానికి చర్యలు తీసుకున్నాయి. అంతేకాకుండా పరిశోధకులు 46 మంది కీలక వ్యక్తులతో (ప్రభుత్వ అధికారులు, అకడమిక్‌లు, పాలసీ నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు) ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారి ప్రకారం, శారీరక వ్యాయామానికి రాజకీయ ప్రాధాన్యం తక్కువగా ఉండటం అమలు జరగకపోవడానికి ప్రధాన కారణం. అయితే ఇది నెమ్మదిగా పెరుగుతోందని కూడా వారు చెప్పారు.

నడక, సైక్లింగ్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ప్రోత్సహించే విధానాలు ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా వాతావరణ మార్పును తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే ఈ రెండు అంశాలను కలిపి చూడడం భవిష్యత్తులో అత్యంత ముఖ్యమని పరిశోధకులు సూచిస్తున్నారు.

# వేసవిలో దీన్ని తినడం వల్ల ఎన్నో లాభాలను పొందవచ్చు.. అత్యంత సహజమైంది, సురక్షితమైంది..



వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు సహజమైన చల్లదనాన్ని ఇచ్చే పదార్థాలను వెతుకుతున్నారు. సహజంగా చల్లదనాన్ని ఇచ్చే వాటిలో గోండ్ కతిరా ఒకటి. ఇది సాధారణంగా చాలా మంది వంటింటి మసాలా డబ్బాలో ఉంటుందని చెప్పవచ్చు. దీనిని ట్రాగాకాంత్ గమ్ అని కూడా పిలుస్తారు. ఇది అస్ట్రాగలస్ అనే మొక్క నుండి వస్తుంది. ఫాలూదా వంటి పానీయాల్లో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. పొట్ట ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేస్తుంది. జీర్ణాశయ ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సర్వేల ప్రకారం 80% మందికి ఆమ్లత్వం లేదా గుండెల్లో మంట వంటి సమస్య ఉంటున్నాయి. అందులో 40% మందికి రోజూ ఈ సమస్య కనిపిస్తోంది. ఈ పరిస్థితిని ICMR (Indian Council of Medical Research), CBHI (Central Bureau of Health Intelligence) వంటి సంస్థలు గమనిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోండ్ కతిరా జీర్ణాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. గోండ్ కతిరా పొట్ట ఆరోగ్యానికి ఏవిధంగా మేలు చేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.

### మంచి బ్యాక్టీరియా వృద్ధికి..

సింథటిక్ కూలింగ్ డ్రింక్స్ కేవలం తాత్కాలిక చల్లదనం మాత్రమే ఇస్తాయి. కానీ గోండ్ కతిరా సహజ ప్రీబయోటిక్. ఇది జీర్ణాశయంలో ఉండే మంచి బ్యాక్టీరియా అయిన బైఫిడో బ్యాక్టీరియా, లాక్టోబాసిల్లస్ పెరగడానికి సహాయ పడుతుంది. మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందడానికి సరైన ఉపరితలాన్ని అందించడం ద్వారా, ఇది లోపలి నుండి పేగు అవరోధాన్ని బలపరుస్తుంది. అలాగే వేసవిలో డీహైడ్రేషన్ వల్ల మలబద్ధకం పెరుగుతుంది. గోండ్ కతిరాలో ఉన్న కరిగే ఫైబర్ మలాన్ని మృదువుగా చేసి సులభంగా బయటకు వెళ్లేలా చేస్తుంది. ఇది OTC లాక్సేటివ్‌లా కడుపు నొప్పిని ఇవ్వదు. యాసిడ్ రిఫ్లక్స్ లేదా గ్యాస్ట్రోఓసోఫాగియల్ రిఫ్లెక్స్ డిసీజ్ (GERD) ఉన్నవారికి ఇది ఉపయోగపడుతుంది. నీటిలో నానబెట్టినప్పుడు జెల్‌లా మారి జీర్ణాశయ గోడపై రక్షణ పొరలా పనిచేస్తుంది. దీంతో కడుపులో మంట తగ్గుతుంది.

### బరువు తగ్గేందుకు..

గోండ్ కతిరాలో ఉన్న అధిక ఫైబర్ వల్ల కడుపు త్వరగా నిండిన భావన కలుగుతుంది. దీంతో ఎక్కువగా తినడం తగ్గుతుంది. ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. బరువు నియంత్రణలో కూడా ఇది సహాయపడుతుంది. గోండ్ కతిరా హైడ్రోకలాయిడ్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో నీరు నిల్వ ఉండేలా సహాయపడుతుంది. వేసవిలో దీనిని తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్, అలసట తగ్గుతాయి. పరిశోధనల ప్రకారం గోండ్ కతిరా బ్లడ్ ప్యూరిఫైయర్‌గా కూడా పనిచేస్తుంది. ఇది పొట్టలో ఉన్న కొన్ని టాక్సిన్స్‌ను బైండ్ చేసి బయటకు పంపుతుంది. దీంతో కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. గోండ్ కతిరాలో క్యాల్షియం, మెగ్నీషియం వంటి మినరల్స్ కూడా ఉంటాయి. ఇవి ఎముకలు, కండరాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఈ విధంగా గోండ్ కటిరా పొట్ట ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### సహజమైంది, సురక్షితమైంది..


వేసవిలో గోండ్ కతిరాను తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు. వేసవిలో చాలా మంది కూల్‌డ్రింక్స్‌ను తాగడానికి ఇష్టపడతారు. కానీ సింథటిక్ కూలింగ్ డ్రింక్స్‌లో ఫాస్ఫారిక్ ఆమ్లం, ఆర్టిఫిషియల్ స్వీట్‌నర్స్, కార్బన్ డయాక్సైడ్ ఎక్కువగా ఉంటాయి. ఇవి జీర్ణాశయానికి హానికరం. గోండ్ కతిరా మాత్రం సహజమైనది, శరీరానికి సురక్షితమైనది. కనుక వేసవిలో చల్లదనానికి సహజంగా లభించే గోండ్ కతిరా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే దీనిని తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని కూడా వారు చెబుతున్నారు. ఎండిన గోండ్ కతిరాను తీసుకోకూడదు. నీటిలో నానబెట్టిన తర్వాతే తినాలి. ఎండినదాన్ని మింగితే గొంతులో ఉబ్బి గొంతుకు అడ్డం పడడం వంటి సమస్యలు కలగవచ్చు.

### నీళ్లను బాగా తాగాలి..

అలాగే దీనిని తీసుకునే వారు తగినంత నీరు తాగాలి. ఇది అధిక ఫైబర్ కలిగి ఉండటం వల్ల రోజుకు కనీసం 2–3 లీటర్ల నీరు తాగాలి. అలాగే కొందరిలో దీనిని తీసుకున్న తరువాత గ్యాస్ లేదా కడుపు ఉబ్బరం వంటి సమస్యలు రావచ్చు. గోండ్ కతిరా మందుల శోషణను నెమ్మదించవచ్చు. కాబట్టి మందులు తీసుకున్న కనీసం 2 గంటల తరువాత దీనిని తీసుకోవడం మంచిది. గోండ్ కతిరా సహజమైనది. లెమన్ షికంజీ లేదా పాలు వంటి పానీయాల్లో కలుపుకుని తాగడం వల్ల వేసవిలో చల్లదనం మాత్రమే కాదు, జీర్ణాశయ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## కాఫీ తాగితే లివర్ క్యాన్సర్ దూరమవుతుందా?

క్రమం తప్పకుండా కాఫీ తాగడం వల్ల శరీరానికి కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉండొచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కాఫీ తాగడం వల్ల కాలేయం (లివర్) ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. చాలా మందికి ఉదయం లేవగానే కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కాఫీ తాగడం వల్ల ఉత్సాహం కలగడంతో పాటూ ఏకాగ్రత కూడా పెరుగుతుంది. అంతేకాకుండా, శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో ఒకటైన లివర్‌ను రక్షించడంలో కూడా కాఫీ కొంతవరకు సహాయపడవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.




పరిశోధనలు ఏం చెబుతున్నాయి?

నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ చేసిన ఒక అధ్యయనం ప్రకారం, రోజుకు రెండు కప్పుల వరకు కాఫీ తాగే వారిలో సాధారణంగా కనిపించే కాలేయ క్యాన్సర్ హెపాటోసెల్యులర్ కార్సినోమా వచ్చే ప్రమాదం దాదాపు 35 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని తేలింది. ఈ పరిశోధనలో మద్యం సేవించడం, హెపటైటిస్ ఇన్ఫెక్షన్, అలాగే బాడీ మాస్ ఇండెక్స్ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఈ ఫలితాలు వచ్చినట్లు నిపుణులు తెలిపారు.

కాఫీ ఎలా సహాయపడుతుంది?

కాఫీ కేవలం కెఫిన్ ఉన్న పానీయం మాత్రమే కాదు. ఇందులో పాలీఫెనాల్స్, డైటర్పెన్స్, యాంటీఆక్సిడెంట్లు వంటి శరీరానికి ఉపయోగకరమైన వందలాది సమ్మేళనాలు ఉంటాయి. నిపుణుల ప్రకారం ఇవి శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తాయి. కాలేయ ఎంజైమ్ స్థాయిలను మెరుగుపరుస్తాయి. దీని వల్ల కాలేయ సంబంధిత వ్యాధులు, కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కొంతవరకు తగ్గవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

రోజుకు ఎంత కాఫీ తాగాలి?

నిపుణుల సూచన ప్రకారం రోజుకు 2 నుంచి 4 కప్పుల వరకు మితంగా కాఫీ తాగడం ఆరోగ్యానికి మంచిదిగా భావిస్తున్నారు. ఫిల్టర్ కాఫీ అయినా, ఇన్‌స్టంట్ కాఫీ అయినా ప్రభావం దాదాపు ఒకేలా ఉండొచ్చు. అయితే అధికంగా కాఫీ తాగితే జీర్ణ సమస్యలు, నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

## వేసవిలో కర్బూజతో ఎన్నో లాభాలు.. తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు



వేసవిలో భానుడు భగభగమంటున్నాడు. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండటంతో శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సమయంలో ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన వరం 'కర్బూజ'(Muskmelon). ఇందులో 95% వరకు నీరు, విటమిన్ సి, పొటాషియం పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, గుండె ఆరోగ్యాన్ని రక్షించడం, బరువు తగ్గడంలో ఇది సహాయపడుతుంది.

### 1.డీహైడ్రేషన్ నుంచి రక్షణ:

ఎండల వల్ల శరీరం త్వరగా నీటిని కోల్పోతుంది. కర్బూజ తినడం, జ్యూస్ చేసుకొని తాగడం వల్ల శరీరానికి అవసరమైన నీరు అంది, రోజంతా ఉత్తేజంగా ఉండటానికి సహాయపడుతుంది.

### 2. రక్తపోటు నియంత్రణ:

కర్బూజలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచడమే కాకుండా, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

### 3. జీర్ణక్రియకు మేలు:

ఇందులో పీచు పదార్థం (ఫీఅఎవతీ) ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకం సమస్యను తొలగించి, జీర్ణ వ్యవస్థను శుభ్రంగా ఉంచుతుంది. అసిడిటీ సమస్యతో బాధపడేవారికి ఇది మంచి ఔషధం.

### 4. కంటి చూపు మెరుగుపరుస్తుంది:

కర్బూజలో ఉండే విటమిన్-ూ, బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపరచడంలో తోడ్పడతాయి. వయసు రిత్యా వచ్చే కంటి సమస్యను ఇది నివారిస్తుంది.

### 5. చర్మ సౌందర్యం:

ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తాజాగా ఉంచుతాయి. ఇది చర్మంపై ముడతలను తగ్గించి, సహజమైన కాంతిని ఇస్తుంది.

### 6. బరువు తగ్గడం:

కర్బూజలో క్యాలరీలు చాలా తక్కువ, కానీ ఫైబర్ ఎక్కువ. ఇది తన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. తద్వారా అనవసరమైన ఆహారం తీసుకోకుండా బరువు తగ్గడానికి సహకరిస్తుంది.

### 7. రోగనిరోధక శక్తి:

## ఇందులో ఉండే విటమిన్ - సి శరీరంలోని తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తుంది




మెట్లు ఎక్కేటప్పుడు గుండె వేగంగా కొట్టుకుంటుందా? కారణాలు ఇవే

మెట్లు ఎక్కేటప్పుడు లేదా కొద్దిదూరం నడిచినప్పుడు గుండె వేగంగా కొట్టుకోవడం చాలా మంది సాధారణమే అనుకుంటారు. కొంతమంది ఇది గుండె సమస్య కావచ్చని అనుకుని చికిత్స కోసం వెళ్తారు. అయితే, ఇది గుండె సమస్యనా, శ్వాసకోశ సమస్యనా లేదా మానసిక ఒత్తిడి కారణమా అనే సందేహం చాలామందికి ఉంటుంది. గుండె స్పందన ఎందుకు పెరుగుతుంది? ఎప్పుడు జాగ్రత్త పడాలి? నిపుణులు ఏమి చెబుతున్నారో చూద్దాం..

ఆరోగ్య నిపుణుల ప్రకారం, మెట్లు ఎక్కేటప్పుడు గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం గుండె సమస్యకు సంకేతం కావచ్చు. గుండెలో ఉన్న రక్తనాళాలు మూసుకుపోతే గుండెకు తగినంత ఆక్సిజన్ అందదు. అప్పుడు గుండె ఎక్కువగా పని చేయాల్సి వస్తుంది. దాంతో గుండె స్పందన వేగంగా పెరుగుతుంది. శ్వాస తీసుకోవడం కష్టంగా అనిపిస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.

### మానసిక ఒత్తిడి

కొన్నిసార్లు ఆందోళన లేదా మానసిక ఒత్తిడి కూడా గుండె స్పందన వేగంగా పెరగడానికి కారణం అవుతుంది. ఉదాహరణకు, ఎక్కడికైనా వెళ్లే ముందు భయం ఉండటం, ఆఫీస్ మీటింగ్ ముందు టెన్షన్ పడటం లేదా ఏదైనా విషయంపై ఎక్కువగా ఆందోళన పడటం వల్ల కూడా గుండె వేగంగా కొట్టుకోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో మానసిక వైద్యులను సంప్రదించడం మంచిది.

### హిమోగ్లోబిన్ తక్కువ ఉండటం

కొన్ని సందర్భాల్లో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండటం (రక్తహీనత) వల్ల కూడా గుండె స్పందన పెరగవచ్చు. అదేవిధంగా థైరాయిడ్ సమస్యలు ఉన్నప్పుడు కూడా గుండె వేగంగా కొట్టుకోవడం జరుగుతుంది. ఈ సమస్యలు ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయి.

### జాగ్రత్తలు

ఈ సమస్యలను తగ్గించుకోవాలంటే కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం అవసరం.ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వాకింగ్ లేదా వ్యాయామం చేయాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ఈ అలవాట్లు పాటిస్తే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు.

## కృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్



కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'దేవరాయ'టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సుదీప్ ప్రసిద్ధ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో కనిపించనున్నారు. 'కన్నడ రాజ్య రామ రమణ.. మూడు రాయరా గండ.. ఆంధ్ర భోజ.. శ్రీకృష్ణదేవరాయ' అనే పవర్‌ఫుల్ బిరుదులతో ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో సుదీప్ కిచ్చా 'దేవరాయ'గా వెండితెరపై అలరించనున్నారు. ఈ పాన్-ఇండియా మూవీని అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తుండగా, సినిమాను 2027 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీప్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు.

## సంకల్ప సాధకుడు పవన్

### తమ్ముడికి అన్న చిరు బర్త్‌డే విషెస్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఆయనకు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను 'సంకల్ప సాధకుడు' అంటూ సంబోధిస్తూ చిరంజీవి రాసిన భావోద్వేగ లేఖ నెట్టింట ప్రస్తుతం వైరల్‌గా మారింది. తమ్ముడు పవన్‌లో చిన్నప్పటి నుంచే నిబద్ధత, ప్రజలకు మంచి చేయాలనే తపన తాను చూస్తున్నానని చిరంజీవి పేర్కొన్నారు. కుటుంబంపై ఎంత ప్రేమ చూపిస్తారో, తనను నమ్మిన ప్రజల పట్ల కూడా పవన్ అంతే వాత్సల్యం చూపుతారని కొనియాడారు. ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ కోసం పవన్ అంకితభావంతో పనిచేస్తున్న తీరు తనలో ఎంతో గర్వాన్ని కలిగిస్తోందని చిరు తెలిపారు. పిఠాపురం ప్రజలకు ఒక ప్రజా ప్రతినిధిలా కాకుండా కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, ప్రజలందరూ మెచ్చే నాయకుడిగా తన లక్ష్యాలను సాధించాలని శ్రీ ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంటూ 'ఇట్లు మీ అన్నయ్య చిరంజీవి' అంటూ ఆప్యాయంగా బర్త్‌డే విషెస్ అందజేశారు.

## పవన్‌కు ప్రత్యే ఫోటోతో బన్నీ శుభాకాంక్షలు



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా టాలీ వుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కెరీర్ ఆరంభం నాటి క్లాసిక్, స్టైలిష్ లుక్‌తో కూడిన ఒక వింటేజ్ పోస్టర్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. 90ల నాటి సినిమా స్టిల్లా అన్నట్లుగా ఉన్న ఈ క్రేజీ ఫొటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో పవన్ కల్యాణ్ ఒత్తుగా ఉన్న కర్లీ హెయిర్, షార్ప్ లుక్ మరియు బ్లాక్ టీ-షర్ట్‌తో సరికొత్త స్టైలిష్ వైబ్స్‌లో ఆకట్టుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన ట్రిబ్యూట్ పోస్టర్ ద్వారా అల్లు అర్జున్ తన బాబాయ్ పవన్ కల్యాణ్‌పై ఉన్న ప్రేమను, అభిమానాన్ని చాటుకున్నారు. మెగా అభిమానులు సైతం ఈ ఫొటోను సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున షేర్ చేస్తూ పవన్‌కు బర్త్‌డే విషెస్ తెలియజేస్తున్నారు.

## ఓటిటిలోకి పళ్ల బురుసు


సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం పళ్ళబురుసు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఇప్పుడీ సినిమా నెలరోజుల్లోపే సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలంగాణ గ్రామీణ కథగా రూపొందింది. కథేంటంటే..: తెలంగాణలోని ఓ పల్లెటూరిలో ఉండే ఒంటరి వృద్ధుడు శంభు (సుధాకర్ రెడ్డి). పంటినొప్పితో ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్ చికిత్స చేసి, కొన్ని మందులు రాసిస్తుంది. అలాగే పళ్ళు నొప్పి రాకుండా ఉండేందుకు వేపపుల్లతో కాకుండా టూత్ బ్రష్ వాడాలని చెబుతుంది. దీంతో ఆ పళ్ళ బురుసు (టూత్ బ్రష్) కొనిమ్మని తన కొడుకు తిరుపతి (మురళీధర్ గౌడ్)ని అడుగుతాడు. కానీ, ఆ కొడుకు వ్యక్తిగత సమస్యల్లో పడి తన తండ్రి మాటని నిర్లక్ష్యం చేస్తాడు. అది శంభుకి కోపా న్ని తెప్పిస్తుంది. సరిగ్గా అదే సమయంలో అతని కొడుకు తనని ఆహ్వానిం చకుండా మనవరాలి పెళ్లి జరిపించడంతో అవమాన భారంతో రగిలిపోతా డు. దీంతో పళ్ళ బురుసు కొనివ్వలేదన్న సాకుతో కొడుకుపై కేసు పెట్టేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతాడు శంభు.

# రజనీ అభిమానులకు పండగ




### అక్టోబర్ 15న జైలర్-2 విడుదల

సూర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడినట్లైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై




హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజినీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.

# ప్రపంచకప్ కోసం రోహిత్ అనుభవం జట్టుకు ఎంతో అవసరం

- కోహ్లీ ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్, అల్టిమేట్ ఫినిషర్
- దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్

భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం.

ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం



జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన, దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణించడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరాటాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.

## టాస్ వేయడానికే రోజంతా పడుతుంది

### పాక్‌ను ట్రోల్ చేసిన పీటర్సన్!

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వరుసగా 2 మ్యాచ్‌లు ఓడిపోయిన పాకిస్థాన్ జట్టు తీవ్ర ఒత్తిడిలో కూరుకు పోయింది. మూడో టెస్టుకు ముందే మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘాలతో సహా ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపివేస్తూ పీసీబీ తీసుకున్న నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సీనియర్లను ఇంటికి పంపి వారి స్థానంలో ఐదుగురు అరంగేట్రం చేయని కొత్త ఆటగాళ్లను ఎంపిక చేయడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు, మాజీ క్రికెటర్లు పెద్ద ఎత్తున వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. ఈ పరిణామాలపై ఇంగ్లాండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్ తనదైన శైలిలో స్పందించాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ అజామ్‌పై హాస్యభరితమైన కామెంట్లు చేశారు. "ప్రతి మ్యాచ్‌కి ముందు జరిగే విలేకరుల సమావేశంలో జట్లలో జరిగిన మార్పుల గురించి వ్యాఖ్యాతలు కెప్టెన్లను అడుగుతారు. ఇప్పుడు నా ఫ్రెండ్ బాబర్‌కు అది చాలా సుదీర్ఘమైన సమావేశం కానుంది. ఈ లెక్కన టాస్ వేసే ఘట్టం మ్యాచ్‌కి ఒక రోజు ముందే ప్రారంభించాలేమో" అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఎద్దేవా చేశారు. మరోవైపు పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత రమీజ్ రాజా కూడా తన సొంత క్రికెట్ బోర్డుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు.



"క్రికెట్ చరిత్రలో సిరీస్ మధ్యలో ఒక జట్టు ఇలా ఏడుగురు ఆటగాళ్లను, కోచ్‌లను మార్చడం నేను ఎప్పుడూ చూడలేదు. పాకిస్థాన్ నిజంగా ఒక కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇది ఫుట్‌బాల్ మ్యాచ్‌లా ఉంది.. సీజన్ మధ్యలోనే మేనేజర్‌ను తీసేసినట్లు చేస్తున్నారు. మరో పది రోజులు ఆగి సిరీస్ ముగిసాక ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేది" అని రమీజ్ రజా పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టుకు ముందు పాక్ జట్టులో మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, రాజావుల్లా, అరాఫత్ మిన్హాస్, ఇమ్రాన్ రంధావా వంటి ఐదుగురు అన్ క్యాప్డ్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. వీరికి తోడు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను తొలగించి వారి స్థానంలో మైక్ హెస్సన్, యాష్లే నాఫ్కేలను నియమించారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609